thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 89 | జగిత్యాల | శుక్రవారం | 26 జూన్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

భారత క్రికెట్ చరిత్రను మార్చిన రోజు



11




# కలిసొచ్చిన సీఎంలు

ఒకే వేదికపై ముగ్గురు ముఖ్యమంత్రులు

దశాబ్దాల అంతర్రాష్ట్ర జల వివాదాల పరిష్కారానికి తుంగభద్ర డ్యామ్ వేదికైంది. గతేడాది వరదలకు కొట్టుకుపోయిన క్రస్ట్ గేటు ఘటన నుంచి పాఠాలు నేర్చుకున్న ప్రభుత్వాలు.. 51 కోట్ల రూపాయలతో పటిష్టంగా నిర్మించిన 33 కొత్త గేట్లను అట్టహాసంగా ప్రారంభించాయి. ఒకే వేదికపై మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి, డీకే శివకుమార్‌తో పాటు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ హాజరు కావడం.. మునిరాబాద్ వేదికగా జల సమస్యలపై వీరంతా కీలక చర్చలు జరపడం రాజకీయంగా తీవ్ర ప్రాధాన్యం సంతరించుకుంది.

- హైదరాబాద్

- తుంగభద్ర డ్యామ్‌కు 51 కోట్లతో 33 కొత్త క్రస్ట్ గేట్లు
- ప్రారంభించిన కేంద్ర మంత్రి పాటిల్, చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, డీకే శివకుమార్
- మునిరాబాద్‌లో అంతర్రాష్ట్ర జల వివాదాలపై కీలక భేటీ
- హోసపేట భారీ బహిరంగ సభకు హాజరు

వివరాలు 2లో..

## పంచాయితీలు వద్దు

జల వివాదాలకు పరిష్కారాలే ముఖ్యం



- ఆర్డీఎస్‌లో మాకొచ్చేది 5 టీఎంసీలే
- కేంద్ర మంత్రి, చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తాం
- తుంగభద్ర సభలో సీఎం రేవంత్ స్పష్టీకరణ

వివరాలు 2లో..

## ఉద్యోగులకు రూ.కోటి బీమా!

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికీ వర్తింపు

2

రవీంద్రభారతిలో పథకాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి




## ఉద్యోగులకు నగదు రహిత వైద్యం!



- ప్రత్యేక ట్రస్టు ద్వారా హెల్త్ కార్డుల మంజూరు
- దశాబ్దాల కల నెరవేరుస్తున్న ప్రజా ప్రభుత్వం
- ఒక్కరూపాయి భారం లేకుండా 1.25 కోట్ల ప్రమాద బీమా
- కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికీ వర్తింపు
- రవీంద్రభారతి సభలో డిప్యూటీ సీఎం భట్టి

ఉద్యోగ సంఘాలు ఎప్పటి నుంచో కోరుతున్న హెల్త్ కార్డుల సమస్యకు తమ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

వివరాలు 3లో..

## తీర్పు కాపీలు ఇవ్వండి!

- ఫిరాయింపుల కేసులో హైకోర్టు ఆదేశం
- కౌంటర్ దాఖలు చేయకపోవడంపై అసంతృప్తి

వివరాలు 3లో..



3

## కార్యకర్తల రక్షణ బాధ్యత నాదే!

- గతంలో జరిగిన పొరపాట్లు ఇక జరగవు
- 2028లో సీఎం కేసీఆర్.. ఆ తర్వాత బాధ్యత నాదే
- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన కేటీఆర్
- రియల్ ఎస్టేట్‌ను పాతాళంలో పాతేసిన రేవంత్



వచ్చే ఎన్నికల్లో మళ్లీ మన ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని, అప్పుడు కార్యకర్తల బాగోగులు, ప్రజల సంక్షేమం రెండింటినీ బ్యాలెన్స్ చేస్తూ ముందుకు తీసుకెళ్లే బాధ్యత తాను తీసుకుంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసా ఇచ్చారు. గతంలో జరిగిన చిన్నచిన్న పొరపాట్లు మళ్లీ జరగనివ్వబోనని హామీ ఇచ్చారు. గురువారం వికారాబాద్ జిల్లా చేవెళ్ల నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు.

వివరాలు 3లో..

## సుచరిత ఇంటిపై మళ్లీ ఏసీబీ పంజా!



ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సోదాలు

భారీగా అక్రమాస్తులను గుర్తించిన అధికారులు

మే 26న లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తహసీల్దార్

3

## ఫీజు బకాయిలు ఎందుకివ్వట్లేదు?

- ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించిన తెలంగాణ హైకోర్టు
- ఆగస్టు 15 లోపు చెల్లిస్తామన్న ప్రభుత్వ న్యాయవాది
- జీవో నంబర్ 9పై మంగళవారం వరకు కోర్టు స్టే

వివరాలు 3లో..

## ఎస్ఐఆర్‌పై రాజకీయం వద్దు!

- ఇది పూర్తిగా చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ
- అపోహలు సృష్టించి గందరగోళానికి గురిచేయొద్దు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూటి ప్రశ్న

2



## సుప్రీంకు వెళ్లాల్సిందే!

- ప్రభుత్వం వేయకపోతే నిరుద్యోగులతో కలిసి మేమే వేస్తాం
- స్థానికతపై హైకోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయాలన్న కవిత

3



## పాస్‌పోర్టు ఫీజులు భారీగా పెంపు



- 14 ఏళ్ల తర్వాత ఛార్జీల సవరణ
- వచ్చే నెల 1 నుంచి కొత్త రుసుము అమలు

4

## పరువు నష్టం కేసులో రాహుల్ విచారం



- మధ్యప్రదేశ్ హైకోర్టులో అదనపు పిటిషన్ దాఖలు
- కార్తికేయను ఉద్దేశించి వ్యాఖ్యలు చేయలేదని వివరణ

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కుమారుడు కార్తికేయ సింగ్ చౌహాన్ దాఖలు చేసిన పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీ కీలక నిర్ణయం తీసుకున్నారు. కార్తికేయ సింగ్‌పై చేసిన వ్యాఖ్యలకు విచారం వ్యక్తం చేస్తూ మధ్యప్రదేశ్ హైకోర్టులో అదనపు పిటిషన్ దాఖలు చేశారు.

4 2

## వెనిజువెలాను వణికించిన జంట భూకంపాలు

- 39 సెకన్ల వ్యవధిలో రెండు భారీ ప్రకంపనలు

4





# ఓటర్ల సవరణపై రాజకీయం వద్దు!

**ఇది పూర్తిగా చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ**

**రాజకీయ స్వార్థం కోసం దుష్ప్రచారం చేయడం తగదు**

**అపోహలు సృష్టించి గందరగోళానికి గురిచేయొద్దు**

**గత కాంగ్రెస్ హయాంలో ఇలాంటి సవరణలు జరగలేదా?**

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూటి ప్రశ్న**

**హైదరాబాద్, జూన్ 25:** ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను రాజకీయ కోణంలో చూడవద్దని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. అది పూర్తిగా రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని గుర్తుచేశారు. కేవలం స్వార్థ ప్రయోజనాల కోసం కొన్ని పార్టీలు లేనిపోని అపోహలు సృష్టిస్తూ దుష్ప్రచారం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. తప్పుల్లేని ఓటర్ల జాబితా రూపకల్పనలో ప్రజలు కూడా చురుగ్గా భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడారు. ఎస్ఐఆర్ అనేది కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం దేశవ్యాప్తంగా జరిగే ఓ నిరంతర ప్రక్రియ అని ఆయన పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు నకిలీ, అక్రమ ఓట్లను తొలగించి ఓటర్ల జాబితాను పారదర్శకంగా మార్చడమే దీని ప్రధాన ఉద్దేశమని వివరించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ పర్యవేక్షణలో బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ తిరిగి ఈ సవరణలు చేపడుతున్నారని తెలిపారు.

**ఆ రంగు పులమడం వెనుక ఆంతర్యం ఏమిటి?**

ఓటర్ల జాబితా సవరణ అనేది ప్రజాస్వామ్యంలో అత్యంత అవసరమైన చట్టబద్ధమైన ప్రక్రియ అని కేంద్ర మంత్రి గుర్తుచేశారు. కానీ కొన్ని రాజకీయ పార్టీలు దీనిపై కావాలనే అపోహలు సృష్టిస్తూ.. ప్రజలను, అధికారులను గందరగోళానికి గురిచేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ ఇలాంటి సవరణలు జరిగాయని.. ఇప్పుడు కేవలం రాజకీయ రంగు పులమడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా చూసుకునేందుకు ప్రజలంతా ఈ సవరణ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ఎక్సైజ్ శాఖలో భారీ బదిలీలు!

**పలువురు డీసీలకు స్థానచలనం.. కొత్త వారికి పోస్టింగులు**

**గ్రేటర్ హైదరాబాద్ డీసీగా శ్రీనివాస్ రెడ్డి**

**హైదరాబాద్, జూన్ 25:** రాష్ట్ర ఎక్సైజ్ శాఖలో పలువురు అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ జిల్లాల్లో డిప్యూటీ కమిషనర్లుగా (డీసీ) పనిచేస్తున్న వారికి స్థానచలనం కల్పించగా.. మరికొందరికి కొత్త పోస్టింగులు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్ రావు ఉత్తర్వులు వెలువరించారు. ఎక్సైజ్ శాఖలో జరిగిన తాజా బదిలీల్లో భాగంగా నల్గొండ డీసీగా ఉన్న ఏ.శ్రీనివాస్ రెడ్డిని గ్రేటర్ హైదరాబాద్ డీసీగా నియమించారు. మెదక్ డీసీ జె.హరికిషన్‌కు సైబరాబాద్ డీసీగా పోస్టింగ్ ఇచ్చారు. ఈస్ట్ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సి.వి.శశిధర్ రెడ్డిని నల్గొండ డీసీగా పంపించారు. రంగారెడ్డి డీసీ దశరథ్‌ను టీజీబీసీఎల్ డీసీగా బదిలీ చేయగా, హెడ్‌క్వార్టర్స్ డీసీ కె.రఘురాంను రంగారెడ్డి డీసీగా నియమించారు. ఖమ్మం డీసీ జనార్దన్ రెడ్డికి ఆదిలాబాద్ డీసీగా బాధ్యతలు అప్పగించారు. నిజామాబాద్ ఏసీ వి.సోమిరెడ్డిని ఖమ్మం డీసీగా పంపించారు. ఏసీ లేబుల్స్ పి.శ్రీధర్‌ను నిజామాబాద్ డీసీగా నియమించారు. టీజీబీసీఎల్ ఆర్ఆర్-1 లో ఉన్న దాతురాజు గౌడ్‌కు వరంగల్ డీసీగా పోస్టింగ్ ఇచ్చారు. కరీంనగర్ బీసీఎల్ మేనేజర్‌గా ఉన్న రవికుమార్‌ను కరీంనగర్ డీసీగా నియమించారు. హైదరాబాద్ ఏసీ ఏ.అనిల్ కుమార్ రెడ్డిని ఈస్ట్ జాయింట్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఏసీ పి.ప్రణవికి మల్కాజిగిరి డీసీగా బాధ్యతలు అప్పగించారు. మహబూబ్‌నగర్ ఏసీగా ఉన్న విజయ్ భాస్కర్ రెడ్డికి అక్కడే డీసీగా పదోన్నతి కల్పించారు. బ్రేవరీస్ ఏసీ చంద్రయ్యను మెదక్ డీసీగా నియమించారు. బదిలీ అయిన అధికారులంతా తక్షణమే కొత్త స్థానాల్లో విధుల్లో చేరాలని ప్రభుత్వం తన ఆదేశాల్లో స్పష్టం చేసింది.

# పాలమూరుకు మరణశాసనమే!

**కర్ణాటక అక్రమ ప్రాజెక్టులతో చుక్క నీరు రాదు**

**ఆర్డీఎస్ వద్ద కొత్తగా లిఫ్టులు, బ్యారేజీల నిర్మాణం**

**రాష్ట్ర ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఫైర్**

**మహబూబ్‌నగర్, జూన్ 25:** కర్ణాటక ప్రభుత్వం నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టుల వల్ల తెలంగాణకు మరణశాసనం ఖాయమని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే పాలమూరు ప్రాంతానికి భవిష్యత్తులో చుక్క నీరు కూడా రాదని ఆయన హెచ్చరించారు. కృష్ణా, తుంగభద్ర నదులపై ఎలాంటి అనుమతులు లేకుండా జరుగుతున్న ఈ నిర్మాణాలతో రైతులు తీవ్ర భయాందోళనల్లో ఉన్నారని గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. తుంగభద్ర ప్రాజెక్టు గేట్లు ఎత్తేందుకు హెలికాప్టర్‌లో వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆ అక్రమ ప్రాజెక్టులు కనిపించలేదా అని శ్రీనివాస్ గౌడ్ నిలదీశారు. ఆర్డీఎస్ కు కేవలం 100 మీటర్ల దూరంలోనే కర్ణాటక ప్రభుత్వం లిఫ్ట్ పనులు మొదలుపెట్టిందని, వీటితో పాటు మరో 2 రోడ్ కమ్ బ్యారేజీలు కడుతోందని ఆయన ఆరోపించారు. మరోవైపు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు గుండ్రేవుల వద్ద 20 టీఎంసీల రిజర్వాయర్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారని వెల్లడించారు. ఈ అక్రమ ప్రాజెక్టులన్నీ పూర్తయితే తుంగభద్ర నీరు శ్రీశైలం ప్రాజెక్టుకు రావడం శాశ్వతంగా ఆగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అక్రమ నిర్మాణాలు పూర్తయితే పాలమూరులో ఎన్ని ప్రాజెక్టులు కట్టినా ఎలాంటి ప్రయోజనం ఉండదని ఆయన స్పష్టం చేశారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెంటనే అక్కడికి వెళ్లి అక్రమ నిర్మాణాలను పరిశీలించాలని డిమాండ్ చేశారు.

# ఒకే వేదికపై ముగ్గురు సీఎంలు!

- తుంగభద్ర డ్యామ్‌కు 51 కోట్లతో 33 కొత్త క్రస్ట్ గేట్లు
- ప్రారంభించిన కేంద్ర మంత్రి పాటిల్, ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, డీకే శివకుమార్
- మునిరాబాద్‌లో అంతర్రాష్ట్ర జల వివాదాలపై కీలక భేటీ
- హోసపేట భారీ బహిరంగ సభకు హాజరు



**బళ్లారి జూన్ 25:** గతేడాది వరదలకు దెబ్బతిన్న తుంగభద్ర డ్యామ్ కొత్త కళ సంతరించుకుంది. నిపుణుల కమిటీ సూచనల మేరకు 51 కోట్లతో కొత్తగా ఏర్పాటు చేసిన 33 క్రస్ట్ గేట్లను మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, డీకే శివకుమార్, కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఒకే వేదికపై మూడు రాష్ట్రాల సీఎంలు కలుసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. 2024 ఆగస్టులో వచ్చిన భారీ వరదలకు తుంగభద్ర ప్రాజెక్టు 19వ గేటు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఆ తర్వాత డ్యామ్‌ను పరిశీలించిన నిపుణుల కమిటీ సూచనల మేరకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రభుత్వాలు 51 కోట్లతో 33 కొత్త స్పిల్ వే గేట్లను ఏర్పాటు చేశాయి. గురువారం మధ్యాహ్నం కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో కలిసి ఏపీ, తెలంగాణ, కర్ణాటక సీఎంలు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, డీకే శివకుమార్ వీటిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయా రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

**జల వివాదాలపై చర్చలు..**

గేట్ల ప్రారంభోత్సవానికి ముందు కొప్పల్ జిల్లా మునిరాబాద్‌లోని ఆడిటోరియంలో మూడు రాష్ట్రాల సీఎంలు, కేంద్ర మంత్రి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించిన కీలక అంశాలపై వీరు చర్చించారు. ఈ సమావేశానికి తొలుత చంద్రబాబు, డీకే శివకుమార్ చేరుకోగా.. రేవంత్ రెడ్డి 15 నిమిషాలు ఆలస్యంగా వెళ్లారు. నీటి సమస్యలపై కీలక చర్చల అనంతరం వీరంతా అక్కడినుంచి గేట్ల ప్రారంభోత్సవానికి వెళ్లారు. ఆ కార్యక్రమం ముగిసిన తర్వాత విజయ నగర జిల్లా హోసపేటలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు.

# నీటి పంచాయితీలు వద్దు!

- జల వివాదాలకు పరిష్కారాలే ముఖ్యం
- ఆర్డీఎస్‌లో మాకొచ్చేది 5 టీఎంసీలే
- కేంద్ర మంత్రి, చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాం
- తుంగభద్ర సభలో సీఎం రేవంత్ స్పష్టీకరణ



**బళ్లారి, జూన్ 25:** తుంగభద్ర నది ఒడ్డున జరిగిన మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీ.. దశాబ్దాల అంతర్రాష్ట్ర జల వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతుందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. తమకు నీటి పంచాయితీలు వద్దని, రైతుల సమస్యలకు పరిష్కారాలే కావాలని ఆయన స్పష్టం చేశారు. తుంగభద్ర డ్యామ్ 33 కొత్త గేట్ల ప్రారంభోత్సవం అనంతరం మునిరాబాద్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ ఘట్టం చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోతుందని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. 3 తరాల సమస్యలకు 33 గేట్ల పునరుద్ధరణతో పరిష్కారం లభించబోతోందని ఆనందం వ్యక్తం చేశారు. దీనివల్ల బళ్లారి, కర్నూలు, అనంతపురం, పాలమూరు ప్రాంతాల సాగు, తాగునీటి కష్టాలు తీరుతాయన్నారు. తక్కువ మాట్లాడి, అత్యంత వేగంగా పనిచేయడం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ప్రత్యేకత అని.. ఆయన చొరవతో ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని విశ్వసిస్తున్నట్లు చెప్పారు. నీటి సమస్యలు పరిష్కారం కాకపోవడం వల్లే నదీ జలాలు వృథాగా సముద్రంలో కలుస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**పాలమూరుకు 10 టీఎంసీలు రావడం లేదు..**

రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ద్వారా పాలమూరుకు 15 టీఎంసీల నీటి వాటా ఉన్నప్పటికీ.. కేవలం 5 టీఎంసీలు మాత్రమే వాడుకోగలుగుతున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. దాదాపు 10 టీఎంసీల నీరు తమ వరకు రావడం లేదన్న విషయాన్ని కేంద్ర మంత్రి పాటిల్, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లానన్నారు. నీటి సమస్యను పరిష్కరించక పోవడంతోనే పాలమూరు వాసులు వలసలు వెళ్లాల్సి వస్తోందని గుర్తుచేశారు. ఈ సమస్యలన్నింటిపై మూడు రాష్ట్రాల మధ్య నీటి చర్చలు ఇప్పుడు ఒక కొలిక్కి వచ్చాయన్నారు. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై కేంద్ర మంత్రితో ప్రత్యేకంగా చర్చించామని తెలిపారు.

**అందరి కష్టాలు తెలిసిన నేత చంద్రబాబు..**

కర్నూలు, అనంతపురం రైతుల సమస్యలు తనకు తెలుసని రేవంత్ చెప్పారు. రైతులందరి కష్టాలు, ప్రాంతాల సమస్యలు తెలిసిన సీనియర్ నాయకుడు చంద్రబాబు అని ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. తుంగభద్ర డ్యామ్‌లో పూడికతీత వ్యవహారంపై కూడా కేంద్ర మంత్రితో చర్చించినట్లు వెల్లడించారు. తుంగభద్ర నది ఒడ్డున జరిగిన చర్చలు అంతర్రాష్ట్ర జల వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాయలసీమ, తెలంగాణలోని లక్షలాది మంది రైతుల ప్రయోజనాల కోసం నీటి పంచాయితీలను పక్కనబెట్టి.. అందరం కలిసికట్టుగా అడుగులు వేద్దామని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# ఉద్యోగులకు రూ.కోటి బీమా!

- కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికీ వర్తింపు
- రవీంద్రభారతిలో పథకాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- పన్నులు ఎగవేసే వారిని పట్టుకుని వసూలు చేయాలి
- అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదు




**హైదరాబాద్, జూన్ 25:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి కోటి రూపాయల ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. గురువారం సాయంత్రం రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ బీమా పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపడంలో ఉద్యోగులదే కీలకపాత్ర అని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. వారి భద్రత, కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకునే ఈ బీమా నిర్ణయం తీసుకున్నామన్నారు. తొలుత సింగరేణిలో ఈ పథకాన్ని ప్రారంభించామని.. ఇప్పటికే 45 మంది కార్మికుల కుటుంబాలకు ఈ బీమా సాయం కింద కోటిన్నర చొప్పున చెల్లించినట్లు తెలిపారు. తాను కూడా మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినే అని, ఉద్యోగుల సమస్యలు తనకు బాగా తెలుసునన్నారు. తాను దొరను కాదని, ప్రజల మధ్య నుంచి ఎదిగిన వ్యక్తినని ఆయన గుర్తుచేశారు.



**15 లక్షల మందికి లబ్ధి..**

గత పాలనలో ఉద్యోగులకు ప్రతి నెల 10వ తేదీ వరకు కూడా జీతాలు అందని పరిస్థితి ఉండేదని సీఎం విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జనవరి 1 నుంచి ప్రతి నెల 1వ తేదీనే ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని గుర్తుచేశారు. ఈ కోటిన్నర బీమా పథకం అమలులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కృషి ఎంతో ఉందన్నారు. బ్యాంకర్లను ఒప్పించి బీమా కల్పిస్తున్నామని.. దీనివల్ల పెన్షనర్లు, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందితో కలుపుకుని రాష్ట్రంలో 15 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. విమాన ప్రమాదంలో చనిపోయిన ఉద్యోగులకు 3 కోట్ల బీమా కల్పిస్తున్నామని ప్రకటించారు.

**రోజుకో గంట అదనంగా పనిచేయాలి..**

రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు ఉద్యోగులు నడుం బిగించాలని, రోజూ ఒక గంట అదనంగా పనిచేయాలని సీఎం పిలుపునిచ్చారు. పన్నులు ఎగవేసే వారిని గుర్తించి కఠినంగా వసూలు చేయడం ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాలని ఆదేశించారు. గత పాలకులు అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక కేంద్రంతో మాట్లాడి 11 శాతంగా ఉన్న వడ్డీ రేట్లను 7.5 శాతానికి తగ్గించగలిగామన్నారు.

**కట్టెలు పెడుతున్నారు..**

రాష్ట్రంలో తాము చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని సీఎం మండిపడ్డారు. మూసీ నది పునరుజ్జీవనం, రీజనల్ రింగు రోడ్డు, మెట్రో విస్తరణ లాంటి పనులు చేస్తుంటే.. అడుగడుగునా అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు ఓట్లు వేయని ప్రజలు ఉంటే ఏంది, పోతే ఏంది అనే రీతిలో బీఆర్ఎస్ నేతలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొన్నారు.

చురకలు



# కార్యకర్తల రక్షణ బాధ్యత నాదే!

- గతంలో జరిగిన పొరపాట్లు ఇక జరగవు
- 2028లో సీఎం కేసీఆర్.. ఆ తర్వాత బాధ్యత నాదే
- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన కేటీఆర్
- రియల్ ఎస్టేట్‌ను పాతాళంలో పాతేసిన రేవంత్



**వికారాబాద్ జూన్ 25:** వచ్చే ఎన్నికల్లో మళ్లీ మన ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని, అప్పుడు కార్యకర్తల బాగోగులు, ప్రజల సంక్షేమం రెండింటినీ బ్యాలెన్స్ చేస్తూ ముందుకు తీసుకెళ్లే బాధ్యత తాను తీసుకుంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసా ఇచ్చారు. గతంలో జరిగిన చిన్నచిన్న పొరపాట్లు మళ్లీ జరగనివ్వబోనని హామీ ఇచ్చారు. గురువారం వికారాబాద్ జిల్లా చేవెళ్ల నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. పార్టీ కేడర్‌కు భవిష్యత్తుపై గట్టి భరోసా ఇచ్చారు. "2028లో మీ అందరి దయతో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారు. ఆ తర్వాత బాధ్యత నేను తీసుకుంటాను. మీకు రావాల్సిన పదవులు, దక్కాల్సిన గౌరవం తీసుకొచ్చే బాధ్యత నాది. గత పదేళ్ల పాలనలో చిన్నచిన్న పొరపాట్లు జరిగి ఉండొచ్చు. ఉద్యమంలో పనిచేసిన బిడ్డలకు అన్యాయం జరిగిందనే భావన ఉండొచ్చు. వాటన్నింటినీ మర్చిపోవాలని ప్రార్థిస్తున్నాను. ఇకముందు అలాంటి పొరపాట్లు జరగనివ్వనని మాట ఇస్తున్నాను" అని కేటీఆర్ పేర్కొన్నారు. కొత్త రాష్ట్రం కావడంతో పాలనపైనే ఎక్కువ దృష్టి పెట్టామని, పార్టీపై ఆశించిన స్థాయిలో ఫోకస్ చేయలేకపోయామని ఆయన వివరించారు.

### ఆ ఐడీ కార్డు జేబులో ఉంటే..

శాంతి సమయంలో సైనికుడు ఎంత చెమటోడిస్తే.. యుద్ధంలో అంత తక్కువ రక్తం కారుతుందని కేటీఆర్ సూచించారు. ఇప్పుడు పార్టీని బలోపేతం చేసుకుంటే రేపు ఎన్నికల సమయంలో ఎలాంటి ఆందోళన ఉండదన్నారు. "మీకు ఒక గుర్తింపు కార్డు ఇస్తాం. రేపు మన ప్రభుత్వం వచ్చాక ఆ కార్డు జేబులో పెట్టుకుని వెళ్తే.. ఏ ఆఫీసర్ అయినా, పోలీసు అయినా సరే.. 'కేసీఆర్ మనిషి వచ్చాడు' అని గౌరవించి పని చేసే పరిస్థితి ఉంటుంది" అని కార్యకర్తలకు ధైర్యం నూరిపోశారు. మనకు అధికారం, ఎమ్మెల్యేలు, ఎంపీలు లేకపోయినా.. ఇంత భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలిరావడం కాంగ్రెస్, బీజేపీ గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోందని ఉత్సాహపరిచారు.

### రియల్ ఎస్టేట్ దివాళా తీసింది..

రియల్ ఎస్టేట్ అంటేనే తానని ప్రగల్భాలు పలికిన సీఎం రేవంత్ రెడ్డి.. ఇప్పుడు ఆ రంగాన్ని వంద అడుగుల లోతులో పాతేసిందని కేటీఆర్ మండిపడ్డారు. "గత కేసీఆర్ ప్రభుత్వంలో షాబాద్, చందన్ వెల్లి, సీతారాంపూర్ ప్రాంతాల్లో దిగ్గజ కంపెనీలు తీసుకొచ్చాం. ఆ దెబ్బకు అక్కడ ఎకరం 30 లక్షల నుంచి 3 కోట్లకు చేరింది. కానీ రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత కోటి రూపాయలు పలికిన భూమిని కనీసం 50 లక్షలకు కూడా ఎవరూ కొనడం లేదు. రియల్ ఎస్టేట్ పూర్తిగా కుప్పకూలడంతో లక్షలాది మంది ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. ఎందుకీ దారుణ పరిస్థితి వచ్చిందో ప్రతి ఒక్కరూ ఆలోచించాలి" అని ఆయన కోరారు.

# ఉద్యోగులకు నగదు రహిత వైద్యం!

- ప్రత్యేక ట్రస్టు ద్వారా హెల్త్ కార్డుల మంజూరు
- దశాబ్దాల కల నెరవేరుస్తున్న ప్రజా ప్రభుత్వం
- ఒక్క రూపాయి భారం లేకుండా 1.25 కోట్ల ప్రమాద బీమా
- కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికీ వర్తింపు
- రవీంద్రభారతి సభలో డిప్యూటీ సీఎం కీలక ప్రకటన



**హైదరాబాద్, జూన్ 25:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న హెల్త్ కార్డుల సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికింది. ప్రత్యేక ట్రస్టు ఏర్పాటు చేసి.. ఉద్యోగులందరికీ పూర్తిస్థాయిలో నగదు రహిత వైద్య సేవలు అందించాలని రాష్ట్ర కేబినెట్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. దీనికి తోడు ఒక్క రూపాయి కూడా ప్రీమియం చెల్లించే పనిలేకుండా ఏకంగా 1.25 కోట్ల ఉచిత ప్రమాద బీమాను కూడా ప్రభుత్వం ప్రకటించింది. రవీంద్రభారతిలో సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గురువారం ఈ ఉచిత బీమా పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ సంఘాలు ఎప్పటి నుంచో కోరుతున్న హెల్త్ కార్డుల సమస్యకు తమ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపుతోందన్నారు. ఒక ప్రత్యేక ట్రస్టు ఏర్పాటు చేసి.. ప్రభుత్వ ఉద్యోగులందరికీ పూర్తి స్థాయిలో 'క్యాష్ లెస్' (నగదు రహిత) వైద్య సేవలు అందించేలా కేబినెట్ నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. దీనివల్ల ఉద్యోగుల ఆరోగ్య భద్రత మరింత మెరుగుపడుతుందనే భరోసా ఇచ్చారు.

### 1.25 కోట్ల ఉచిత ప్రమాద బీమా..

ఉద్యోగుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు దేశ చరిత్రలోనే తొలిసారిగా బంపర్ ఆఫర్ ప్రకటించామని భట్టి తెలిపారు. ప్రభుత్వంపై గానీ, ఉద్యోగులపై గానీ ఎలాంటి భారం పడకుండా బ్యాంకర్లతో మాట్లాడి 1.25 కోట్ల ఉచిత ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. విమాన ప్రమాదం జరిగితే 2 నుంచి 3 కోట్ల వరకు బీమా పరిహారం అందుతుందన్నారు. 18 నుంచి 60 ఏళ్ల వయసున్న వారికి 10 లక్షల జీవిత బీమా రక్షణ ఉంటుందని వివరించారు. రెగ్యులర్ సిబ్బందికే కాకుండా.. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి కూడా ఈ బీమా వర్తిస్తుందని శుభవార్త చెప్పారు. ప్రమాదవశాత్తూ శాశ్వత లేదా పాక్షిక వైకల్యం సంభవించినా ఈ పథకం ద్వారా ఆర్థిక అండ లభిస్తుందన్నారు.

### ఒకటో తేదీనే జీతాలు..

గత ప్రభుత్వ హయాంలో జీతాలు 15 లేదా 20వ తేదీ వరకు రాకపోవడం వల్ల ఉద్యోగులు పడిన ఇబ్బందులను భట్టి గుర్తుచేశారు. ఈఎంఐలు కట్టలేక వారి సిబిల్ స్కోర్ దెబ్బతినేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం రాగానే ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉన్నప్పటికీ.. ఉద్యోగుల హక్కులను కాపాడాలనే ఉద్దేశంతో ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు ఇస్తున్నామని చెప్పారు. 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చేందుకు ఉద్యోగులు, ప్రభుత్వం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, నేతలు అజారుద్దీన్, వివేక్, సీఎస్ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# స్థానికతపై సుప్రీంకు వెళ్లాల్సిందే!

- హైకోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయాలన్న కవిత
- ప్రభుత్వం వేయకపోతే నిరుద్యోగులతో కలిసి మేమే వేస్తాం
- గ్రూప్-1 నియామకాల్లో తెలంగాణ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం
- అధికారంలోకి రాగానే జ్యుడీషియల్ కమిటీతో రివ్యూ చేసి తీరుతాం




**హైదరాబాద్, జూన్ 25:** తెలంగాణ స్థానికత అంశంపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని బీఆర్ఎస్ నేత కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే 15 రోజుల తర్వాత నిరుద్యోగులతో కలిసి తామే పిటిషన్ వేస్తామని హెచ్చరించారు. గ్రూప్-1 నియామకాల్లో స్థానికులకు తీవ్ర అన్యాయం జరిగిందని, తాము అధికారంలోకి రాగానే జ్యుడీషియల్ కమిటీ వేసి ఈ నియామకాలను రివ్యూ చేస్తామని ఆమె స్పష్టం చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో 'తెలంగాణ స్థానికత - సవాళ్లు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కవిత మాట్లాడుతూ.. స్థానికత విషయంలో 600 ఏళ్లుగా మన మీద దాడి జరుగుతూనే ఉందన్నారు. బహుమనీ రాజ్యం ఈ స్థానికత పోరాటం కారణంగానే 5 సామ్రాజ్యాలుగా విడిపోయిందని, అందులో 1 మన గోల్కొండ అని గుర్తుచేశారు. ఆ తర్వాత స్థానికుల హక్కులను కాపాడేందుకు అసఫ్ జాహీలు 1868 లో రూల్స్ తెచ్చారని, 1919 లో 15 ఏళ్ల స్థానికతతో ముల్కీ నిబంధనలు తీసుకొచ్చారని తెలిపారు. 1956 లో మనం ఆంధ్రప్రదేశ్‌లో విలీనం అయ్యాక ఆ గడువును 12 ఏళ్లకు, 1969 ఉద్యమం కారణంగా వచ్చిన 6 సూత్రాలతో 4 ఏళ్లకు కుదించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ ప్రభుత్వంలో జై భారత్ కమిషన్ వేసి 50,000 కు పైగా ఉద్యోగాలు స్థానికేతరులకు వెళ్లాయని తేల్చినా.. 610 జీవో ద్వారా కూడా న్యాయం జరగలేదన్నారు. 2014 లో ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకున్నా ఈ 12 ఏండ్లలో మనకు అన్యాయమే జరిగిందన్నారు.

### గ్రూప్-1 లో తీవ్ర అన్యాయం..

గ్రూప్-1 నియామకాల్లో 563 ఉద్యోగాలకు గాను నాన్ లోకల్ కింద 2 పోస్టులు మాత్రమే ఇవ్వాల్సి ఉండగా.. అక్రమంగా ఈడబ్ల్యూఎస్, బీసీ-డీ సర్టిఫికెట్లు ఇచ్చి 11 మందికి కట్టబెట్టారని కవిత ఆరోపించారు. ఆ 9 పోస్టులు మన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రావాల్సినవని మండిపడ్డారు. నిరుద్యోగులు సవాల్ చేస్తే ప్రభుత్వం ప్రజా ధనంతో పెద్ద లాయర్లను పెట్టి యువతపై దౌర్జన్యాలకు దిగుతోందని విమర్శించారు. మొత్తం మీద 200 మంది ఇతర రాష్ట్రాల వాళ్లే ఉండే ప్రమాదం ఉందన్నారు. రాజ్యాంగం ఇచ్చిన రక్షణను కాపాడాల్సిన జడ్జీలు ప్రెసిడెన్షియల్ ఆర్డర్ నంబర్ 7 లోని 3 రూల్స్‌ను కలిపి చూడటం సరికాదన్నారు. ఇప్పుడున్న పరిస్థితులు చూస్తుంటే మళ్లీ 15 ఏళ్ల ముల్కీ రూల్స్ రావాల్సిన అవసరం కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు.

### జులై 2 న మిలియన్ మార్చ్..

స్థానికతపై హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయకపోతే మనకు మనమే అన్యాయం చేసుకున్నట్లవుతుందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ సంస్థలతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలతో 1 ఉద్యోగం కూడా రాలేదన్నారు. పైగా బ్యాంక్‌కు ఇచ్చిన భూమిని ప్రభుత్వమే అమ్ముకుంటే స్టేట్ బ్యాంక్ వాళ్లు కేసు వేశారని, ఇలాంటప్పుడు పెట్టుబడులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. నీళ్ల విషయంలో కర్ణాటక వెళ్లి సీఎం మంగళహారతులు పడుతున్నారని, దీనివల్ల మన నీటి వాటా హక్కును కోల్పోతామని ఆరోపించారు. రేవంత్ రెడ్డి చేస్తున్న అన్యాయాలను ప్రజలకు వివరిస్తామని, జులై 2 న ఉప్పల్ భగాయత్‌లో మరో మిలియన్ మార్చ్ నిర్వహిస్తామని కవిత వెల్లడించారు.



# తీర్పు కాపీలు ఇవ్వండి!

**ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో హైకోర్టు ఆదేశం**

**కౌంటర్ దాఖలు చేయకపోవడంపై అసంతృప్తి**

**స్పీకర్‌తో పాటు ఆ 10 మందికీ మళ్లీ నోటీసులు**

**తదుపరి విచారణ జూలై 22కు వాయిదా**

**హైదరాబాద్ జూన్ 25:** బీఆర్ఎస్ నుంచి పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు గురువారం కీలక విచారణ జరిపింది. ఈ వ్యవహారంలో స్పీకర్ ఇచ్చిన తీర్పు కాపీలను తమ ముందు ఉంచాలని ఆదేశించింది. గతంలో ఇచ్చిన నోటీసులకు ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు వ్యవహారంపై తెలంగాణ హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. గతంలో ఈ ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పలువురు దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు పరిశీలించింది. ఈ విచారణ సందర్భంగా.. అనర్హత పిటిషన్లపై స్పీకర్ ఇచ్చిన తీర్పు కాపీలను కోర్టుకు సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ 10 మంది ఎమ్మెల్యేలతో పాటు స్పీకర్ కూడా తమ కౌంటర్ దాఖలు చేయాలని న్యాయస్థానం మరోసారి నోటీసులు జారీ చేసింది. ఇంతకుముందు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయకపోవడంపై కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అందరూ కచ్చితంగా కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేస్తూ.. కేసు తదుపరి విచారణను జూలై 22కు వాయిదా వేసింది.

# ఫీజు బకాయిలు ఎందుకివ్వట్లేదు?

**ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించిన తెలంగాణ హైకోర్టు**

**బకాయిలివ్వకుండా ప్రైవేట్ కాలేజీలు ఎలా నడుపుతారు?**

**ఆగస్టు 15 లోపు చెల్లిస్తామన్న ప్రభుత్వ న్యాయవాది**

**జీవో నంబర్ 9పై మంగళవారం వరకు కోర్టు స్టే**

**హైదరాబాద్ జూన్ 25:** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు గట్టిగా నిలదీసింది. బకాయిలు చెల్లించకుండా, విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయొద్దంటే ప్రైవేట్ యాజమాన్యాలు కళాశాలలను ఎలా నడుపుతాయని సూటిగా ప్రశ్నించింది. విద్యార్థుల నుంచి ఫీజుల వసూలును అడ్డుకుంటూ ప్రభుత్వం తెచ్చిన జీవో నంబర్ 9లోని కొన్ని నిబంధనలపై మంగళవారం వరకు స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు స్వల్ప ఊరట లభించింది. ఫీజుల బకాయిల వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఉద్దేశించి కోర్టు పలు కీలక వ్యాఖ్యలు చేసింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎంత బడ్జెట్ కేటాయించారని, పెండింగ్ బకాయిలను ఎప్పటిలోపు చెల్లిస్తారో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దీనికి ప్రభుత్వం తరఫు న్యాయవాది స్పందిస్తూ.. ఆగస్టు 15లోపు బకాయిలన్నీ చెల్లిస్తామని న్యాయస్థానానికి బదులిచ్చారు. ప్రభుత్వం బకాయిలు చెల్లిస్తే.. తమ పిటిషన్లను వెనక్కి తీసుకుంటామని ప్రైవేట్ కళాశాలల తరఫు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. ఇదే అంశంపై విద్యార్థులు కూడా కోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. అటు ప్రభుత్వం, ఇటు యాజమాన్యాల మధ్య విద్యార్థులు తీవ్రంగా నలిగిపోతున్నారని వారి తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఈ ఫీజుల బకాయిల సమస్యతో విద్యార్థులు నష్టపోకుండా చూడాలని కోర్టును అభ్యర్థించారు. కాగా, ఈ వ్యవహారంపై మంగళవారం రాష్ట్ర అడ్వకేట్ జనరల్ తమ వాదనలు వినిపిస్తారని ప్రభుత్వం తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం.. కేసు తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

# సుచరిత ఇంటిపై మళ్లీ ఏసీబీ పంజా!

**ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సోదాలు**

**భారీగా అక్రమాస్తులను గుర్తించిన అధికారులు**

**మే 26న లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తహసీల్దార్**



**హైదరాబాద్ జూన్ 25:** శామీర్‌పేట్ తహసీల్దార్ సుచరిత నివాసంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మరోసారి సోదాలు చేపట్టారు. గత నెలలో లంచం కేసులో దొరికిన ఆమెకు.. ఆదాయానికి మించి భారీగా అక్రమాస్తులు ఉన్నాయనే సమాచారంతో ఈ ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. స్థానిక రైతులకు చెందిన 30 ఎకరాలను వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు సుచరిత గతంలో 30 లక్షలు లంచం డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా మే 26న తొలివిడత కింద 2 లక్షల సొమ్మును తన ప్రైవేట్ డ్రైవర్ ద్వారా తీసుకుంటుండగా ఆమె ఏసీబీకి అడ్డంగా పట్టుబడ్డారు. దీంతో అధికారులు సుచరితను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే ఆ విచారణ క్రమంలో సుచరితకు భారీగా ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. లంచం వ్యవహారంలో అరెస్టై రిమాండ్‌లో ఉన్న ఆమెపై.. తాజాగా ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగానే ఆమె ఇళ్లలో మరోమారు ముమ్మర సోదాలు కొనసాగిస్తున్నారు.



# ఇరాన్‌తో ఆయిల్ డీల్‌కు మళ్లీ అవకాశం!

ప్రపంచం బాగుండాలంటే ముందు ట్రంప్ దూకుడుకు అక్కడి పార్లమెంట్ కళ్లెం వేయాలి. ఇరాన్‌పై ఇంకా ఆంక్షలు విధించడం, బెదిరించడం వంటివి చేయకుండా చూసుకోవాలి. ఎందుకంటే ఒక్క ట్రంప్ కారణంగా ప్రపంచం యావత్తూ అతాలకుతలం అయ్యింది. సునీమా వచ్చినంత పనయ్యింది. మళ్లీ కోలుకోవడమెలా అన్న సందిగ్ధంలో ప్రపంచ దేశాలు ఉన్నాయి. అన్ని దేశాల ఆర్థిక స్థితి దిగజారింది. ముఖ్యంగా భారత్ లాంటి అనేక దేవాల్లో ఆర్థిక సంక్షోభం నెలకొంది. ఈ క్రమంలో ఇరాన్‌ను తన మానా తను బతికేలా చూడాలి. ట్రంప్ ఇక తన దేశ పురోగతికి సమయం కేటాయిస్తే చాలు. హర్మూజ్ తెరుచుకోవడం, చమురు ధరలు దిగిరావడం అన్నది ఊరటనిచ్చే అంశం. ముఖ్యంగా భారత్‌కు పెద్ద ఊరట అని చెప్పాలి. అలాగే భారత్ ఎవరి వద్ద చమురు కొనాలో వద్దో అన్నది అమెరికాకు సంబంధించిన వ్యవహారం కాదు. భారత్ ఎవరితో వాణిజ్యం చేయాలో చేస్తుంది. ఎవరితో చమురు డీల్ చేసుకోవాలో చేసుకుంటుంది. అంతేగానీ వేలుపెట్టాలని ఇక ట్రంప్ చేడడం మానుకోవాలి. ట్రంప్ తీరువల్ల అమెరికా ఇప్పటికీ పీకల్లోతు ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయింది. అక్కడా చమురు ధరలు పెరిగాయి. నిరుద్యోగం పెరిగింది. అక్కడున్న వారిని వెళ్లగొట్టే ప్రయత్నంలో తీసుకుంటున్న నిర్ణయాలు ప్రణసంకటంగా మారాయి. ముఖ్యంగా భారతీయ టెక్కీలకు ఇదొక సమస్యగా మారింది. ఇకపోతే చమురు ధరలు దిగిరావడం, మళ్లీ హర్మోజ్ తెరుచుకోవడం తో ఇక స్వేచ్ఛా వాణిజ్యానికి అవకాశం వచ్చింది. దీనిపై అటు ట్రంప్ కానీ, ఇటు ఇరాన్ కానీ పేచీలు లేకుండా చూసుకోవాలి. పశ్చిమాసియాలో యుద్ధం ముగియడంతో పాటు ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలను సడలించడం వంటి కారణాలతో క్రూడాయిల్ ధరలు దిగొస్తున్నాయి.అటు బంగారం, వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో భారత్–ఇరాన్ మధ్య ఇంధన రంగంలో మళ్లీ కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇరాన్ చమురు మంత్రి మొహ్సెన్ పక్‌నెజాద్ ఈ వారం భారత పెట్రోలియం మరియు సహజ వాయు మంత్రిత్వ శాఖ అధికారులతో సమావేశం కానున్న నేపథ్యంలో, భారత్‌కు ఇరాన్ నుంచి ముడి చమురు సరఫరాల భవిష్యత్తుపై ఆసక్తి నెలకొంది. దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత ఈ ఏడాది ప్రారంభంలో పరిమిత స్థాయిలో ఇరాన్ చమురు దిగుమతులు తిరిగి ప్రారంభమయ్యాయి. అమెరికా ఆంక్షలకు ముందు భారత్‌కు ప్రధాన ముడి చమురు సరఫరాదారుల్లో ఇరాన్ ఒకటి. ముఖ్యంగా తక్కువ ధరలు, అనుకూల క్రెడిట్ సౌకర్యాలు, భారత రిఫైనరీలకు అనువైన నాణ్యత కారణంగా ఇరాన్ చమురుకు మంచి డిమాండ్ ఉండేది. భారత్–ఇరాన్ మధ్య జరగనున్న తాజా చర్చలు ఇంధన రంగంలో కొత్త అవకాశాలకు దారితీయవచ్చని నిపుణులు భావిస్తున్నారు. అయితే పూర్తి స్థాయిలో ఇరాన్ చమురు దిగుమతులు పునరుద్ధరించబడేందుకు ఇంకా సమయం పట్టే అవకాశం ఉందని, భవిష్యత్ కొనుగోళ్లు వాణిజ్య ప్రయోజనాలు, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు మరియు ఆంక్షల పరిస్థితులపై ఆధారపడి ఉంటాయని విశ్లేషకులు చెబుతున్నారు. 2015లో భారత్ సుమారు 11 మిలియన్ మెట్రిక్ టన్నుల ముడి చమురును ఇరాన్ నుంచి దిగుమతి చేసుకుంది. అది దేశ మొత్తం చమురు దిగుమతుల్లో 6 శాతం వాటాను కలిగి ఉంది. 2016లో ఈ దిగుమతులు 14 ఎంఎంటీలకు చేరి వాటా 6.7 శాతానికి పెరిగింది. అయితే, 2017లో ఇరాన్ నుంచి దిగుమతులు భారీగా పెరిగాయి. ఆ ఏడాది భారత్ 27 ఎంఎంటీల చమురును కొనుగోలు చేయగా, దేశ మె-ుత్తం చమురు అవసరాల్లో ఇరాన్ వాటా 12.6 శాతానికి చేరుకుంది. ఇదే గరిష్ట స్థాయి. 2018లో దిగుమతులు 23 ఎంఎంటీలకు తగ్గినా, ఇరాన్ వాటా 10.4 శాతంగా కొనసాగింది. 2019లో 24 ఎంఎంటీల దిగుమతులతో ఇరాన్ వాటా 10.6 శాతంగా నమోదైంది. అయితే 2019 మేలో అమెరికా ఇరాన్‌పై ఆంక్షలను కఠినతరం చేసి, చమురు కొనుగోలు చేసే దేశాలకు ఇచ్చిన మినహాయింపులను రద్దు చేయడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దీంతో భారత్ ఇరాన్ నుంచి చమురు కొనుగోళ్లను నిలిపి వేయాల్సి వచ్చింది. ఈ ప్రభావం 2020లో స్పష్టంగా కనిపించింది. ఆ ఏడాది భారత్ కేవలం 2 ఎంఎంటీల చమురును మాత్రమే ఇరాన్ నుంచి దిగుమతి చేసుకుంది. దీంతో దేశ మొత్తం చమురు దిగుమతుల్లో ఇరాన్ వాటా 1 శాతం కంటే దిగువకు పడిపోయింది. ఇటీవల నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీ (ఎన్ఐఓసీ) భారత రిఫైనరీలు, వ్యాపార సంస్థలను సంప్రదించి భవిష్యత్ చమురు సరఫరాలపై చర్చలు ప్రారంభించి నట్లు సమాచారం. అయితే భారత రి÷నైరీలు ప్రస్తుతం జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి. అమెరికా ఆంక్షలపై స్పష్టత, చెల్లింపు విధానాలు, షిప్పింగ్ మరియు బీమా సౌకర్యాలపై భరోసా లభించిన తర్వాతే పెద్ద ఎత్తున కొనుగోళ్లపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కెప్లర్ డేటా ప్రకారం, జూన్ నెలలో భారత్ రోజుకు సుమారు 73 వేల బ్యారెళ్ల ఇరాన్ ముడి చమురును దిగుమతి చేసుకుంది. ఏప్రిల్‌లో పరిమిత స్థాయిలో పునఃప్రారంభమైన సరఫరాలు క్రమంగా పెరుగుతున్నట్లు ఇది సూచిస్తోంది.

# వెనిజువెలాను వణికించిన జంట భూకంపాలు

- 39 సెకన్ల వ్యవధిలో రెండు భారీ ప్రకంపనలు
- భవనాలు కూలిపోవడంతో తీవ్ర విధ్వంసం.. అత్యవసర పరిస్థితి ప్రకటించిన ప్రభుత్వం



**కారకాస్, జూన్ 25:** వెనిజువెలాలో వరుసగా సంభవించిన రెండు శక్తివంతమైన భూకంపాలు తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. కేవలం 39 సెకన్ల వ్యవధిలో రిక్టర్ స్కేలుపై 7.2, అనంతరం 7.5 తీవ్రతతో నమోదైన ప్రకంపనలతో రాజధాని కారకాస్‌తో పాటు కరీబియన్ తీర ప్రాంతాలు వణికిపోయాయి. భారీ భవనాలు, నివాస సముదాయాలు కూలిపోగా, ప్రాథమిక సమాచారం ప్రకారం 32 మంది మరణించగా, 700 మందికి పైగా గాయపడినట్లు వెనిజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ వెల్లడించారు. అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకారం కారకాస్‌కు పశ్చిమాన సుమారు 168 కిలోమీటర్ల దూరంలోని మోరన్ సమీపంలో, 22 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం నమోదైంది. దాదాపు శతాబ్ద కాలం తర్వాత నమోదైన అత్యంత శక్తివంతమైన భూకంపంగా అధికారులు పేర్కొంటున్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ప్రాథమిక అంచనాలు సూచిస్తున్నాయి. లా గువైరా, మోరన్, కారకాస్ పరిసర ప్రాంతాల్లో అనేక భవనాలు నేలమట్టమయ్యాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక బృందాలు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్, కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. సైమన్ బొలివర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో టెర్మినల్ భవనం పైకప్పు దెబ్బతినడంతో విమానాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలను మూసివేస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. భూకంపాల అనంతరం దేశవ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించిన తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు భవనాల్లోకి వెళ్లకుండా బహిరంగ ప్రదేశాల్లోనే ఉండాలని ప్రభుత్వం సూచించింది. అనంతర ప్రకంపనల ముప్పు ఇంకా కొనసాగుతున్నందున అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. భూకంపం సంభవించడానికి కొన్ని క్షణాల ముందే ఆండ్రాయిడ్ ఎర్త్‌క్వేక్ అలర్ట్ సిస్టమ్ ద్వారా పలువురు స్మార్ట్‌ఫోన్ వినియోగదారులకు హెచ్చరికలు అందినట్లు సోషల్ మీడియాలో స్క్రీన్‌షాట్లు వైరల్ అవుతున్నాయి. యాక్సిలరోమీటర్ సెన్సార్ ఆధారంగా పనిచేసే ఈ వ్యవస్థ ప్రాథమిక భూకంప తరంగాలను గుర్తించి ముందస్తు హెచ్చరికలు పంపినట్లు టెక్నాలజీ నిపుణులు చెబుతున్నారు. వెనిజువెలాలో సంభవించిన ఈ ప్రకృతి విపత్తుపై ప్రపంచ దేశాలు సానుభూతి వ్యక్తం చేశాయి. బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నామని భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా సహాయక చర్యలకు అవసరమైన మద్దతు అందిస్తామని వెల్లడించారు.

## ఒకేరోజు పలు దేశాల్లో ప్రకంపనలు

కాలిఫోర్నియా, జపాన్, పుల్వామాలోనూ ప్రకంపనలు

వెనెజువెలా దేశం శతాబ్దకాలంలో ఎన్నడూ చూడని ప్రకృతి విపత్తును చవిచూసింది. వెనువెంటనే రెండు శక్తిమంతమైన భూకంపాలతో ఉక్కిరిబిక్కిరైంది. తొలి భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.1గా నమోదు కాగా, రెండోది మరింత తీవ్రత (7.5)తో వచ్చింది. అదే సమయంలో కొంచెం అటూఇటుగా అమెరికాలోని కాలిఫోర్నియాలో (5.6), జపాన్ (7.2)లోనూ భూకంపాలు వచ్చాయి. ప్రపంచంలో ఒకే రోజు ఇలా వేర్వేరు చోట్ల పుడమి ఉగ్రరూపం దాల్చడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ భూకంపాల మధ్య ఏమైనా సంబంధం ఉందా..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అయితే, దీనికి 'కాదు' అనే సమాధానం ఇస్తున్నారు కాలిఫోర్నియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన భూకంప శాస్త్రవేత్త డాక్టర్ లూసీ జోన్స్. ఈ భూకంపాలు వేర్వేరు ఫాల్ట్ సిస్టమ్స్ (ఫలకాలు కలిసే సరిహద్దులు, పగుళ్లు), ప్లేట్ బౌండరీల్లో సంభవించాయి. అంటే వాటి మధ్య సంబంధం లేదని అర్థం. ఒకదానిని మరొకటి ప్రేరేపించలేదు. ఒక చోట సంభవించే భారీ భూకంపాలు.. వేల మైళ్ల దూరంలో మరో భూకంపానికి దారితీసే అవకాశం చాలా తక్కువగా ఉంటుందని జోన్స్ వెల్లడించారు. ఇలా ఒకే సమయంలో వేర్వేరు చోట్ల భూమి కంపించడం అనేది యాదృచ్ఛికమేనని చెబుతున్నారు. ఒక ప్రాంతంలో భూకంపం రావడమనేది అనూహ్యంగా జరిగే సంఘటన కాదు. కొన్ని దశాబ్దాలు, శతాబ్దాలుగా భూగర్భంలో ఒత్తిడి పేరుకుపోయి.. ఫలకాలు ఒకదానికొకటి రాసుకోవడం వల్ల ఇవి సంభవిస్తుంటాయి. అయితే భూకంపాలు సరిగ్గా ఎప్పుడు వస్తాయనేది అంచనా వేయడం అసాధ్యమే అయినా.. ఇలా ఒక్కసారిగా భూమి కంపించడం ఒక చక్రంలా జరిగే పక్రియేనని జోన్స్ పేర్కొన్నారు. కాగా.. జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాలో 3.5 తీవ్రతతో భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. బుధవారం సాయంత్రం నుంచి ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో భూకంపాలు రాగా.. గురువారం తెల్లవారుజామున పుల్వామాలో భూమి కంపించిందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ వెల్లడించింది. భూకంప కేంద్రం నేపాల్‌లో 15 కిలోమిటర్ల లోతున ఉన్నట్లు పేర్కొన్నారు. ఇక, జపాన్‌లో తొలుత భూకంప తీవ్రత 6.9 అని రాగా.. తర్వాత దానిని 7.2గా సవరించారు. చాలా తక్కువ వ్యవధిలో అంటే కొన్ని సెకన్ల నుంచి నిమిషాల తేడాతో దాదాపు ఒకే తీవ్రత గల రెండు భూకంపాలు ఒకే ప్రాంతంలో సంభవించడాన్ని 'ఎర్త్‌క్వేక్ డబ్లెట్' అంటారు. ఒకసారి భూకంపం వచ్చిన తర్వాత తక్కువ తీవ్రతతో చిన్న చిన్న ప్రకంపనలు రావడం సహజమే. కానీ డబ్లెట్ విషయానికొస్తే.. రెండోసారి వచ్చే భూకంపం కూడా దాదాపు మొదటిదానంత తీవ్రంగా ఉంటుంది. ఇప్పుడు వెనెజువెలాలో 39 సెకన్ల వ్యవధిలో వరుస భూకంపాలు వచ్చాయి. దీంతో ఇప్పుడు ఈ దేశ పరిస్థితిని శాస్త్రవేత్తలు 'ఎర్త్‌క్వేక్ డ్లబెట్'గా పిలుస్తున్నారు. వెనెజువెలాలో ఈస్థాయిలో భూకంపం 1900 సంవత్సరంలో వచ్చింది. అప్పుడు దాని తీవ్రత 7.7గా నమోదైంది. దాంతో రాజధాని సమీప ప్రాంతాలు ప్రభావితమయ్యాయి. మళ్లీ 2018లో 7.3 తీవ్రతతో భూమి కంపించినప్పటికీ.. ఆస్తి, ప్రాణనష్టం ఇప్పటితో పోలిస్తే తక్కువగానే సంభవించింది.

# పాస్‌పోర్టు ఫీజులు భారీగా పెంపు

- 14 ఏళ్ల తర్వాత ఛార్జీల సవరణ
- వచ్చే నెల 1 నుంచి కొత్త రుసుము అమలు

న్యూఢిల్లీ, జూన్ 25: కేంద్ర ప్రభుత్వం పాస్‌పోర్టు ఫీజులను భారీగా పెంచింది. దాదాపు 14 ఏళ్ల తర్వాత ఛార్జీలను సవరిస్తూ విదేశాంగ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త రుసుములు వచ్చే నెల 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. 18 ఏళ్లు పైబడిన వారు కొత్తగా 36 పేజీల పాస్‌పోర్టు పొందేందుకు లేదా పునరుద్ధరణ (రీ--ఇష్యూ) కోసం ఇకపై రూ.2,500 చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఈ రుసుము రూ.1,500గా ఉండేది. అత్యవసర సేవ అయిన తత్కాల్ విధానంలో ఇదే పాస్‌పోర్టు కోసం ఫీజును రూ.3,500 నుంచి రూ.5,000కు పెంచారు. 60 పేజీల పాస్‌పోర్టు ఫీజును రూ.2,000 నుంచి రూ.3,500కు పెంచగా, తత్కాల్ విధానంలో ఈ పాస్‌పోర్టు కోసం రూ.6,000 చెల్లించాల్సి ఉంటుంది. గతంలో ఈ ఫీజు రూ.4,000గా ఉండేది.

## పోగొట్టుకుంటే మరింత భారం

పాస్‌పోర్టు పోగొట్టుకున్న వారు కొత్తగా 36 పేజీల పాస్‌పోర్టు పొందాలంటే ఇకపై రూ.5,000 చెల్లించాల్సి ఉంటుంది. తత్కాల్ విధానంలో ఈ ఫీజు రూ.7,500గా నిర్ణయించారు. 60 పేజీల పాస్‌పోర్టు విషయంలో సాధారణ ఫీజు రూ.6,000 కాగా, తత్కాల్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే రూ.8,500 చెల్లించాల్సి ఉంటుంది. పాస్‌పోర్టు నిబంధనల్లో మార్పులు చేస్తూ విదేశాంగ శాఖ కొత్త ఫీజులను ప్రకటించింది. చివరిసారిగా 2012లో పాస్‌పోర్టు రుసుములను సవరించగా, ఇప్పుడు 14 ఏళ్ల తర్వాత మరోసారి ఫీజులను పెంచడం గమనార్హం.



# పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీ విచారం

- మధ్యప్రదేశ్ హైకోర్టులో అదనపు పిటిషన్ దాఖలు
- కార్తికేయను ఉద్దేశించి వ్యాఖ్యలు చేయలేదని వివరణ



**భోపాల్, జూన్ 25:** కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కుమారుడు కార్తికేయ సింగ్ చౌహాన్ దాఖలు చేసిన పరువు నష్టం కేసులో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కీలక నిర్ణయం తీసుకున్నారు. కార్తికేయ సింగ్‌పై చేసిన వ్యాఖ్యలకు విచారం వ్యక్తం చేస్తూ మధ్యప్రదేశ్ హైకోర్టులో అదనపు పిటిషన్ దాఖలు చేశారు. తన వ్యాఖ్యలు కార్తికేయను ఉద్దేశించి చేసినవి కావని అందులో స్పష్టం చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ప్రమోద్ కుమార్ అగర్వాల్ విచారణ చేపట్టనున్నారు. 2018లో మధ్యప్రదేశ్‌లోని ఝాబువాలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో రాహుల్ గాంధీ పనామా పేపర్స్ అంశాన్ని ప్రస్తావిస్తూ కార్తికేయ సింగ్ పేరును ప్రస్తావించారు. తనపై ఆధారరహిత ఆరోపణలు చేసి పరువు నష్టం కలిగించారని ఆరోపిస్తూ కార్తికేయ భోపాల్‌లోని ఎంపీ–ఎమ్మెల్యే ప్రత్యేక న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారణకు హాజరుకావాలని ట్రయల్ కోర్టు రాహుల్ గాంధీకి సమన్లు జారీ చేసింది. ట్రయల్ కోర్టు జారీ చేసిన సమన్లను, తనపై నమోదైన పరువు నష్టం కేసును కొట్టివేయాలని కోరుతూ రాహుల్ గాంధీ ఇప్పటికే మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో తాజాగా తన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేస్తూ మరో పిటిషన్ దాఖలు చేశారు.రాహుల్ గాంధీ తాజా పిటిషన్‌పై బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఆధారాలు లేకుండా వ్యాఖ్యలు చేసి తర్వాత విచారం వ్యక్తం చేయడం రాహుల్‌కు అలవాటైందని బీజేపీ ఐటీ సెల్ ఆరోపించింది. కార్తికేయ సింగ్ పేరును ఎందుకు ప్రస్తావించాల్సి వచ్చిందని ప్రశ్నిస్తూ, ఇటువంటి వ్యాఖ్యలు ఆయన విశ్వసనీయతను దెబ్బతీస్తాయని విమర్శించింది.

# గోడౌన్ కూలిన ఘటనలో 8కి చేరిన మృతుల సంఖ్య

## కొనసాగుతున్న సహాయక చర్యలు..

**కోల్‌కతా, జూన్ 25:** మహానగరంలోని తరతల ప్రాంతంలో గోడౌన్ కుప్పకూలిన సంఘటనలో మ-రణించిన వారి సంఖ్య 8కి పెరిగింది. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించామని అధికారులు వివరించారు. మరో18 మంది గోడౌన్ శిథిలాల కింద చిక్కుకున్నారని తెలిపారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో గోడౌన్‌లో 60 మంది వరకు కార్మికులు ఉన్నారని వివరించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, భారత ఆర్మీ, నగర పోలీసులతోపాటు స్థానికుల సహకారంతో సహయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకోగానే.. మంత్రులతో కలిసి సీఎం సువేందు అధికారి ఘటన స్థలానికి చేరుకున్నారు. స్వయంగా సహాయక చర్యలను పర్యవేక్షించారు. మరో వైపు బాధితుల కుటుంబ సభ్యుల కోసం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ కంట్రోల్ రూం.. 8697981070, 033 22143526, 033 22535185 నెంబర్లు విడుదల చేసింది. బుధవారం సాయంత్రం ఈ గోడౌన్ కూలిన సంగతి తెలిసిందే. ఈ ఘటన జరిగిన వెంటనే ఐదుగురు కార్మికులు మ-రణించగా.. 20 మంది తీవ్రంగా గాయపడిన విషయం విదితమే.

చురకలు





హిందూ–ముస్లిం సౌభ్రాతృత్వానికి ప్రతీకగా

# మల్యాల మొహరం వేడుకలు

వేలాదిగా తరలివచ్చిన భక్తులు – పులివేషాలు, పీరీల ఊరేగింపులతో సందడి

**మల్యాల, జూన్ 25:** జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మొహరం (పీరీల) వేడుకలు హిందూ–ముస్లిం ఐక్యతకు, అన్యోన్య ప్రేమానురాగాలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచాయి. నిజాం నవాబు కాలం నుంచి కొనసాగుతున్న ఈ సంప్రదాయం నేటికీ అదే వైభవంతో కొనసాగుతూ ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. ముస్లింల ఆరాధ్యులైన హసన్, హుస్సేన్‌ల స్మారకార్థం నిర్వహించే ఈ వేడుకల్లో హిందువులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం విశేషం. తమ కోరికలు నెరవేరాలని కోరుకుంటూ యువకులు, వృద్ధులు పులివేషాలు, రాక్షస వేషాలు, యాదవ వేషధారణలు ధరించి గ్రామ వీధుల్లో తిరుగుతూ మొక్కులు చెల్లించుకుంటారు. పీరీల వద్ద ధూపం వేయించి తీసిన విభూదిని భక్తులు నుదుటన ధరించి ఆశీర్వాదంగా స్వీకరిస్తారు. అనారోగ్య సమస్యలు, దుష్టశక్తుల ప్రభావం తొలగుతాయని విశ్వసించే భక్తులు పీరీలకు బెల్లం, కర్చీఫ్‌లు, టవల్స్, నగదు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. చివరి రోజు నిర్వహించిన పీరీల మహా ఊరేగింపు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. డప్పు చప్పుళ్లు, నృత్యాలు, పులివేషాలు, రంగురంగుల ప్రదర్శనల మధ్య పీరీలను గ్రామ వీధుల గుండా ఘనంగా ఊరేగించారు. మల్యాల అంగడి బజార్ ప్రాంతం జాతరను తలపించేలా సందడిగా మారింది. వివిధ ప్రాంతాలతో పాటు ముంబై, భివండి తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కూడా వేడుకల్లో పాల్గొని ప్రత్యేక వేషధారణలతో ఆకట్టుకున్నారు. అనంతరం పీరీలను మల్యాల చెరువులో సంప్రదాయబద్ధంగా శుద్ధి చేసి తిరిగి భద్రపరిచారు.ముస్లింలు నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో హిందువులు వేలాదిగా పాల్గొనడం మల్యాల ప్రాంత ప్రత్యేకతగా నిలుస్తోంది. మత సామరస్యానికి, సామాజిక ఐక్యతకు ఈ వేడుకలు ప్రతీకగా నిలుస్తున్నాయని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.



దూడం శ్రీశైలం, సీనియర్ జర్నలిస్టు, జగిత్యాల, 91339 47176

## ఉప సర్పంచ్‌ల హక్కులను కాపాడాలి

**శంకరపట్నం, జూన్ 25:** ఉప సర్పంచ్‌ల చెక్ పవర్‌ను రద్దు చేస్తున్నారనే వార్తలను తెలంగాణ ప్రభుత్వం వెంటనే అధికారికంగా ఖండించాలని కేశవపట్నం ఉప సర్పంచ్, కరీంనగర్ జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం కో–ఆర్డినేటర్ ఆకుబత్తిని విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన “హలో ఉప సర్పంచ్ – చలో హైదరాబాద్” కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉప సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, వారి అధికారాలు, బాధ్యతలకు తగిన గుర్తింపు కల్పించాలని కోరారు.

ఉప సర్పంచ్‌ల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి, గ్రామాభివృద్ధిలో వారి పాత్రను మరింత బలోపేతం చేసే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఉప సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ కోసం అవసరమైతే భవిష్యత్తులో మరింత ఉధృతంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## ప్రజా ఆరోగ్యం, సంక్షేమమే లక్ష్యంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సేవలు:



**కుత్బుల్లాపూర్, జూన్ 25 (:):**

చింతల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఎల్వోసీ పత్రాల పంపిణీ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ ప్రత్యేకంగా పాల్గొన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్పకు చెందిన కె. సుజాతమ్మ భర్త కె. మాధవస్వామి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.1,10,000 విలువైన ఎల్వోసీ మంజూరు చేయించారు. గురువారం మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు బాధిత కుటుంబానికి ఆ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పేద ప్రజల ఆరోగ్య భద్రత, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసే ప్రజానాయకుడు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అని కొనియాడారు. అవసరమైన సమయంలో ప్రజలకు అండగా నిలుస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేరవేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, బాబు గౌడ్, నర్సింహా రెడ్డి, సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీ కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొన్న మంత్రి అడ్లూరి, ఎమ్మెల్యే సంజయ్



**హైదరాబాద్ బ్యూరో, జూన్ 25 :**

హైదరాబాద్ లోని జన్వాడ కే కాన్వెన్షన్ లో జరిగిన కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్ కుమారుడి వివాహ వేడుకకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

- బీ.ఎల్.వోల ఇంటింటి ఫారాల పంపిణీని పరిశీలించిన కలెక్టర్ బి. సత్య ప్రసాద్..

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 25 :**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జగిత్యాల రూరల్ మండలం చల్ గల్ గ్రామంలో గురువారం బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని జగిత్యాల జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు ఓటర్లకు ఫారాల



పంపిణీ, వివరాల నమోదు, అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలను అందజేయాలని, ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పని చేయాలని అన్నారు. ఓటర్ల నుంచి అందిన ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి, వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని సరైన సమాచారం అందించాలని కోరారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే కీలక ప్రక్రియ అని పేర్కొన్న కలెక్టర్, అధికారులు, బీఎల్‌వోలు పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, తహసీల్దార్ హకీమ్, సంబంధిత సిబ్బంది, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ఓటరు మ్యాపింగ్‌ను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 25**

కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంలో భాగంగా గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం సర్కిల్ పరిధి కైసర్‌నగర్‌లో నిర్వహిస్తున్న ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను స్థానిక మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఉప కమిషనర్ వెంకటరమణతో కలిసి ఓటర్ల నమోదు, ధృవీకరణ కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, బూత్ లెవల్ ఆఫీసర్లు (బిఎల్‌ఓ లు) ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఓటర్ల నమోదు ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించాలని సూచించారు. అలాగే నకిలీ ఓట్ల తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రతి పౌరుడు బిఎల్‌ఓ ల నుంచి ఎన్యుమరేషన్ ఫారమ్‌ను స్వీకరించి తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని, 18 సంవత్సరాలు నిండిన యువత ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమం ద్వారా కొత్త ఓటు హక్కును పొందవచ్చని తెలిపారు. స్థానిక ప్రజలు, ఓటర్లు బిఎల్‌ఓ లకు పూర్తిస్థాయిలో సహకరించి సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గాజులరామారం



ఉప కమిషనర్ వెంకటరమణ, బూత్ లెవల్ ఆఫీసర్లు, కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, తోసిపు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పాదయాత్ర నిర్వహించిన దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 25 :**

296 దుండిగల్ డివిజన్ పరిధిలోని దుండిగల్ గ్రామంలోని కింది బస్తీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ గురువారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలు, బస్తీలు, ప్రధాన రహదారులు మరియు ప్రజా సౌకర్యాల ప్రాంతాలను సందర్శించి స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పాదయాత్రలో భాగంగా గ్రామ ప్రజలు తాగునీటి కొరత, డ్రైనేజీ వ్యవస్థ లోపాలు, దెబ్బతిన్న రహదారులు, వీధి దీపాల సమస్య, పారిశుద్ధ్య లోపాలు, మురుగు నీటి నిల్వలు, దోమల బెడద తదితర మౌలిక సదుపాయాల సమస్యలను ఆయన దృష్టికి



తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కావలి గణేష్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సంక్షేమం కోసం పనిచేయడం తన బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల మరియు ప్రజల జీవన ప్రమాణాల పెంపు కోసం నిరంతరం పోరాడతానని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఆయన, గ్రామ ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని అన్నారు. ఈ పాదయాత్రలో వాపుల శ్రీనివాస్, దొంతి మహేష్ ముదిరాజ్, రామారం జితయ్య ముదిరాజ్, పండుగ శివ ముదిరాజ్‌తో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించిన కలెక్టర్ సత్య ప్రసాద్

**జగిత్యాల/మేడిపల్లి, జూన్ 25 :**

జగిత్యాల జిల్లా మేడిపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మమేకమై వారికి పాఠాలు బోధించారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని తెలుసుకుంటూ విద్యా ప్రమాణాలపై ఆరా తీశారు. అనంతరం పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన కలెక్టర్, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందుతున్నదీ లేదీ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజన నాణ్యతను విద్యార్థులతో కలిసి సహబంతి భోజనం చేశారు, పరిశుభ్రత, పాఠశాల నిర్వహణపై సంబంధిత అధికారులకు పలు సూచనలు



చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ విద్యార్థినుల కోసం అదనపు డార్మెటరీ అవసరాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే డార్మెటరీ నిర్మాణానికి అనుమతి మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ



కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీఓ జీవాకర్ రెడ్డి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజ్‌కుమార్, బీసీ వెల్ఫేర్ అధికారి జయరాజ్, తహసీల్దార్, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రూ.55 లక్షలతో 8 సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

- ముఖ్య అతిథిగా పాల్గొన్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి..

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 25 :**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 278వ డివిజన్ గాజులరామారం పరిధిలోని శ్రీరాంనగర్–బి, ఎంఎఫ్ ఫంక్షనల్ హాల్ ప్రాంతంలో సీసీ రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను కాలనీ వాసులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకురాగా, ఆయన వెంటనే స్పందించి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నిధుల ద్వారా రూ.55 లక్షల వ్యయంతో మొత్తం 8 సీసీ రోడ్ల నిర్మాణానికి మంజూరు చేయించారు. ఈ నేపథ్యంలో గురువారం నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం కాలనీ వాసులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ్ రెడ్డి, డీసీసీ సెక్రటరీ లాయక్, బోయిని వెంకటేష్,



శ్రీధర్ వర్మ, సతీష్ బాబు, మాయిన్ భాయ్, కాలనీ అధ్యక్షుడు మస్జీద్ భాయ్, హరీష్, ఆఫ్జాల్, శ్రీనివాస్ రావు, రహీమ్, ఖలీమ్, అజయ్, పాషా తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమాన్ని పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 25 :**

గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం సర్కిల్ పరిధి కైసర్ నగర్‌లో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమాన్ని స్థానిక మున్సిపల్ ఉప కమిషనర్ వెంకట రాములతో కలిసి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, ఓటరు నమోదు ప్రక్రియను బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్‌ఓలు) ఇంటింటికి వెళ్లి పారదర్శకంగా, సమర్థవంతంగా



నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఓటరు జాబితాలో ఖచ్చితత్వం ఉండేలా అవసరమైన వివరాలను సేకరించాలని అధికారులకు సూచించారు. ప్రజలు బీఎల్‌ఓలు అందించే ఎన్యుమరేషన్ ఫారమ్‌లను సక్రమంగా నింపి సమర్పించాలని, 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి పౌరుడు ఈ కార్యక్రమంలో భాగస్వామి అయి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవెల్ ఆఫీసర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మించడంలో యువత భాగస్వాములు కావాలని

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్
- ప్రతి ఒక్క విద్యార్థి యాంటీ డ్రగ్స్ వారియర్ గా పనిచేయాలి..
- ఉన్నత లక్ష్యాలను సాధించి తల్లిదండ్రులకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి..

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 25 :**
యువత సమాజం నుంచి మంచి విలువలను మాత్రమే నేర్చుకోవాలని, చెడు వ్యసనాలు, మాదకద్రవ్యాల బారినపడి తమ భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని గురువారం జగిత్యాల పట్టణంలోని వాసవి గార్డెన్స్‌లో నిర్వహించారు.

**ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ**

డ్రగ్స్ వ్యక్తిగత ఆరోగ్యాన్నే కాకుండా కుటుంబ వ్యవస్థను, సామాజిక విలువలను, దేశ భవిష్యత్తును కూడా దెబ్బతీస్తాయని అన్నారు. యువత జీవితంలో విజయాలను సాధించాలంటే క్రమశిక్షణ, పట్టుదల, కఠోర శ్రమ అనే మూడు సూత్రాలను పాటించాలని సూచించారు. కొంతమంది యువకులు ఆసక్తి, స్నేహితుల ఒత్తిడి లేదా తప్పుడు ప్రచారాలకు ఆకర్షితులై డ్రగ్స్ వైపు మొగ్గు చూపుతున్నారని, అలాంటి నిర్ణయాలు జీవితాన్ని చీకటిలోకి నెట్టివేస్తాయని హెచ్చరించారు. "డ్రగ్స్‌లో మొదటి అడుగు సరదాగా ప్రారంభమవుతుందని, చివరి అడుగు జీవితాన్ని నాశనం చేస్తుందని" పేర్కొన్నారు. డ్రగ్స్ వ్యాపారులు యువతనే లక్ష్యంగా చేసుకుని "ఒక్కసారి ప్రయత్నించు.. ఏం కాదు" లేదా "ఇది ఫ్యాషన్" అంటూ మోసం చేస్తున్నారని, అలాంటి వ్యక్తులు, అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా డ్రగ్స్



ఆఫర్ చేసినా, వారు ఎంత సన్నిహితులైనా ధైర్యంగా "నో" చెప్పాలని, ఆ ఒక్క నిర్ణయం జీవితాన్ని పెద్ద ప్రమాదం నుంచి కాపాడుతుందని తెలిపారు. జిల్లా పోలీసు శాఖ మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించిందని, డ్రగ్స్ విక్రయాలు, రవాణా, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి "డ్రగ్స్‌కు నో చెప్పండి – జీవితానికి ఎస్ చెప్పండి" అనే నినాదంతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై వీడియోల ద్వారా అవగాహన కల్పించారు. డ్రగ్స్ నివారణలో యువత పాత్రపై ఎస్పీ అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, కరుణాకర్, ఎస్‌ఐలు మల్లేశం, కుమారస్వామి, సదకర్, సుప్రియా, ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# నల్ల పోచమ్మ తల్లి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 25 :**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని గాజులరామారం సర్కిల్ పోచమ్మ బస్తీలో వెలసిన నల్ల పోచమ్మ తల్లి ఆలయంలో నిర్వహించిన కళ్యాణ మహోత్సవంలో గురువారం కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు కార్యక్రమానికి హాజరైన ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నల్ల పోచమ్మ తల్లి కృపా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి



కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అలాగే ఈ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ను శాలువాతో సత్కరించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు బుచ్చిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు గోపాల్ గౌడ్, సుగ్రీవుడు, సంధ్యారెడ్డి, మహేందర్ రెడ్డి, పూలమ్మ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి నగర్ కూరగాయల మార్కెట్ అంశంపై కొలన్ హన్మంత్ రెడ్డి గారిని కలిసిన మార్కెట్ యాజమాన్యం

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి జూన్ 25 :**
గురువారం బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రగతి నగర్ కూరగాయల మార్కెట్ యాజమాన్యం, వ్యాపారులు మరియు స్థానికులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి గారిని కలిసి మార్కెట్ నిర్వహణకు సంబంధించిన తమ అభిప్రాయాలు, సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రస్తుతం మార్కెట్ నిర్వహిస్తున్న ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు పెద్దగా లేవని, మార్కెట్‌ను ప్రగతి స్కూల్ మెయిన్ రోడ్ వద్దకు తరలిస్తే ట్రాఫిక్ రద్దీ పెరగడంతో పాటు ప్రమాదాల అవకాశాలు కూడా అధికమవుతాయని తెలిపారు. ప్రజల భద్రత, వ్యాపారుల జీవనోపాధి మరియు వినియోగదారుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం ఉన్న ప్రదేశంలోనే మార్కెట్‌ను కొనసాగించాలని కొలన్ హన్మంత్ రెడ్డి ని కోరారు. వారి వినతిని శ్రద్ధగా విన్న కొలన్ హన్మంత్ రెడ్డి ప్రజలు, వ్యాపారుల ప్రయోజనాలకు అనుగుణంగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో షరీఫ్ భాయ్, ప్రశాంత్, ఆంజనేయులు, కృష్ణారెడ్డి, భాస్కర్, మాణిక్యం, చిన్న



ఆంజప్ప, బురాన్, లాల్ మొహమ్మద్, జహంగీర్, లక్ష్మి, నాగలక్ష్మి, కుమారి, రాము, మహాలక్ష్మి, మేరి కుమారి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలోనే మహిళలకు ప్రాధాన్యత

**మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ..**

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 25 :**
తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు సరైన ప్రాధాన్యత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే లభిస్తుందని మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ ఐలయ్యగౌడ్ అన్నారు. గురువారం రోడామేస్త్రినగర్ డివిజన్ పరిధిలోని మగ్దూమ్‌నగర్‌లో డ్వాక్రా సంఘ మహిళలకు ప్రభుత్వం అందజేస్తున్న చీరల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గూడ వరమ్మ మాట్లాడుతూ, మహిళా శక్తిని గుర్తించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు



ఆత్మగౌరవంతో సమాజంలో జీవించేలా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి మహిళలకు అండగా నిలుస్తూ వారి సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. మహిళల అభివృద్ధే దేశాభివృద్ధికి పునాది అని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పంపిణీ చేసిన బతుకమ్మ చీరల్లో నాణ్యత లోపించిందని, కొందరికే పరిమితమై మహిళల పట్ల వివక్ష చూపారని విమర్శించారు. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో నాణ్యమైన చీరలు అందజేయడం ద్వారా మహిళల గౌరవాన్ని పెంచుతున్నారని తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదిగి సమాజంలో మరింత గుర్తింపు పొందాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్.పి. పరకాల సత్యలక్ష్మి, డ్వాక్రా సంఘ సభ్యులు గూడ నిర్మల, డి. స్వర్ణలత, యాదమ్మ, లక్ష్మి, శోభ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బిఆర్‌టియు రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి జన్మదిన వేడుకలు

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 25**
బిఆర్‌టియు రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి జన్మదిన వేడుకలు ఆయన కార్యాలయంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన కార్మికులు, ఆటో కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, నియోజకవర్గ నాయకులు, మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవిని శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలువురు కార్మిక నాయకులు మాట్లాడుతూ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసే నాయకుడు రవి అని కొనియాడారు. కార్మికులకు ఎలాంటి కష్టం వచ్చినా అండగా నిలుస్తూ, ప్రతి ఒక్కరికి న్యాయం జరిగే వరకు పోరాడే వ్యక్తిగా ఆయన మంచి గుర్తింపు పొందారని పేర్కొన్నారు. కార్మిక కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న రవికి మరోసారి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, కుటుంబ సభ్యులతో కలిసి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ




కార్యక్రమంలో సంతోష్ గౌడ్, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్‌లో విలువైన ప్రభుత్వ భూమికి రెవెన్యూ అధికారుల ఫెన్సింగ్

- ప్రభుత్వ స్థలాన్ని రక్షించిన అధికారులకు అభినందనలు
  – నల్ల జయశంకర్ గౌడ్..

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 25 :**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పెదబషీర్‌బాద్ గ్రామం సర్వే నెం. 23లో ఉన్న విలువైన ప్రభుత్వ భూమిని పరిరక్షించేందుకు రెవెన్యూ అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ భూమి అని సూచించే బోర్డును ఏర్పాటు చేయడంపై సామాజిక కార్యకర్త నల్ల జయశంకర్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుమారు రూ.100 కోట్లకు పైగా విలువ చేసే ప్రభుత్వ భూమిని కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం స్వాగతించదగ్గ విషయమన్నారు. గత 15 నెలలుగా ఈ ప్రాంతంలోని ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం తాము నిరంతరం పోరాటం చేస్తున్నామని, భూమి




రక్షణ కోసం వివిధ స్థాయిల్లో ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. మార్చి 2026లో కుత్బుల్లాపూర్ తహసీల్దార్ (ఎంఆర్వో) హైడ్రాకు లేఖ రాయడం, అలాగే ప్రభుత్వ భూమిలో రోడ్డు నిర్మాణ ప్రయత్నాలపై అదనపు కలెక్టర్‌కు ప్రజావాణి ద్వారా ఫిర్యాదు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో కుత్బుల్లాపూర్ ఎంఆర్వో రాజేష్ ఆధ్వర్యంలో అధికారులు సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిని గుర్తించి, ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ, గత 15 నెలలుగా పలుమార్లు ఎంఆర్వో, కలెక్టర్ కార్యాలయాలకు ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని గుర్తించి రక్షణ చర్యలు చేపట్టడం సంతోషకరమన్నారు. అలాగే, స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూమిలో అవసరమైన ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయడంతో పాటు, మిగిలిన స్థలాన్ని ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా, కుత్బుల్లాపూర్ ప్రాంతంలో గతంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పులి బలరాం, ఎల్లస్వామి, ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ పోచమ్మ దేవాలయ పునర్నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం అందజేసిన మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీష్



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 25**
కుత్బుల్లాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీష్ సమాజసేవ పట్ల తన అంకితభావాన్ని మరోసారి చాటుకున్నారు. గణేష్ నగర్–2 ప్రాంతంలోని శ్రీ పోచమ్మ అమ్మవారి దేవాలయం పునర్నిర్మాణ కార్యక్రమానికి గురువారం ఆయన రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ నగర్–2 అధ్యక్షుడు శరత్‌కు విరాళం చెక్కును అందజేసిన కేఎం గౌరీష్ మాట్లాడుతూ, మన సంస్కృతి, సంప్రదాయాలు మరియు ఆధ్యాత్మిక విలువలను పరిరక్షించడంలో దేవాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. దేవాలయాలు కేవలం ప్రార్థనా స్థలాలు మాత్రమే కాకుండా, సమాజాన్ని ఐక్యతతో కలిపే ఆధ్యాత్మిక కేంద్రాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. శ్రీ పోచమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి అందించిన ఈ సహాయం స్థానిక ప్రజల్లో సేవా దృక్పథాన్ని పెంపొందించడమే కాకుండా, సామాజిక బాధ్యతకు మంచి ఉదాహరణగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, యాదగిరి, నరసింహారెడ్డి, జ్యోతి, నర్లకంటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నవదంపతులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి



**గజ్వేల్ టౌన్, జూన్ 25**
సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగిన వివాహ వేడుకకు ముఖ్య అతిథులుగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి హాజరయ్యారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ 4వ వార్డు బీజేపీ కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్ కుమారుడు, జగదేవపూర్ రాగులరాజు కుమార్తెల వివాహ వేడుకకు విచ్చేసి, నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ శుభకార్యంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు నవదంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# బోయినపల్లి కుమారుని పెళ్లికి ఎమ్మెల్యే హాజరు



**హైదరాబాద్ బ్యూరో, జూన్ 25 :**
హైదరాబాద్ లోని జన్వాడ కె కన్వెన్షన్ హాల్లో గురువారం జరిగిన కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కుమారుని వివాహానికి టిపిసిసి ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# పచ్చునూర్ లో న్యూమరేషన్ ఫారం స్వీకరించిన ఎమ్మెల్యే దంపతులు



**మానకొండూర్ ప్రతినిధి, జూన్ 25 :**
మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కమ్మంపల్లి సత్యనారాయణ తన స్వగ్రామం పచ్చునూరులో గురువారం ఎనిమరేషన్ ఫారాన్ని అధికారుల నుంచి తీసుకున్నారు. పచ్చునూరు గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (సర్) నిర్వహించిన సందర్భంగా ఆయన తన సతీమణి డాక్టర్ కవ్వంపల్లి అనురాధతో కలిసి ఎంఆర్వో, బీఎల్ఏలు, బీఎల్‌వోల నుంచి ఎన్యూమరేషన్ ఫారాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి అర్హుడైన పౌరుడు భాగస్వామి కావాలని, తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఓటరు తన బాధ్యతను గుర్తించి ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం అధికారులు, బీఎల్ఏలు, బీఎల్‌వోలతో కార్యక్రమం నిర్వహణపై వివరాలు తెలుసుకుని, విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు చేశారు.

చురకలు

శుక్రవారం 26 జూన్ 2026

# 19వ వార్డులో ఎస్ఐఆర్ కార్యక్రమం

- **ఓటరు నమోదు, సవరణలపై అవగాహన**

**సదాశివపేట, జూన్ 25**

సదాశివపేట పట్టణంలోని 19వ వార్డులో గురువారం నాడు ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఓటరు నమోదు, వివరాల సవరణ, ప్రభుత్వ మార్గదర్శకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమాన్ని సదాశివపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పట్లూరి నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించగా, 19వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ పట్లూరి రోజానాగరాజు గౌడ్ పాల్గొని ప్రజలతో మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి అర్హుడైన వ్యక్తి తన పేరు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని, వివరాల్లో మార్పులు ఉంటే వెంటనే సవరించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో బీఎల్ఓ సూపర్వైజర్ శివాని, బీఎల్ఓ లక్ష్మణ్, బీఎల్ఏ ఎండి సలీం తదితరులు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవసరమైన సమాచారం అందించారు. ఓటరు జాబితా పరిశీలన, నమోదు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

- **బీ.ఎల్.వో.ల ఇంటింటి ఫారాల పంపిణీని పరిశీలించిన అదనపు కలెక్టర్ బి.ఎస్ లత..**
- **గ్రామ సభల ద్వారా రీ-సర్వే పనులు వేగవంతం చేయాలి..**

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 25 :**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత అధికారులను ఆదేశించారు. గురువారం మల్లాపూర్ మండలం ముత్యం పేట గ్రామంలో బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్వోలు ఓటర్లకు ఫారాల పంపిణీ, వివరాల నమోదు, అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలను అందజేయాలని, ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పని చేయాలని అన్నారు. ఓటర్ల నుంచి అందిన ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి, వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని సరైన సమాచారం అందించాలని కోరారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూసర్వే-రీ సర్వే సందర్భంగా మల్లాపూర్ మండలంలోని ఇందిరా నగర్ గ్రామంలో భూముల రీ-సర్వేకు సంభందించిన అవగాహణ సదస్సు ( గ్రామ సభ) నిర్వహించారు. భూమి రీ-సర్వే చేయుటలో చట్టం పరిదిలో వున్నా సర్వే అండ్ బౌండరీ యాక్ట్ 1923 గురించి మరియు సర్వే కార్యాక్రమాల గురించి, సర్వే చేయు పని విదానాల గురించి ఇట్టి గ్రామ సభలో గ్రామ రైతులకు, ప్రజలకు అవగాహణ కల్పించారు. ఈ కార్యక్రమంలో భూమి కొలతల ఏడి కిషన్ ప్రసాద్, తహసీల్దార్, సంబంధిత సిబ్బంది, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.



# వీరన్నపేట చెరువులోని 11 కేవీ విద్యుత్ లైన్‌ను వెంటనే మార్చాలి

**రైతుల డిమాండ్**

**చేర్యాల రూరల్, జూన్ 25**

సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం వీరన్నపేట గ్రామ పరిధిలోని చెరువు మీదుగా వెళ్తున్న 11 కేవీ విద్యుత్ లైన్ కారణంగా గత అనేక సంవత్సరాలుగా తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయని గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం11 కేవీ లైన్‌కు సంబంధించిన ఇన్సులేటర్లు ఫెయిల్ కావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో విద్యుత్ శాఖ లైన్‌మన్ నరేందర్ చెరువులోకి వెళ్లి ప్రమాదకర పరిస్థితుల్లో ఇన్సులేటర్లను మార్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అయితే చెరువు మీదుగా ఉన్న ఈ విద్యుత్ లైన్ కారణంగా తరచూ ఇలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నప్పటికీ, సంబంధిత అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఇప్పటివరకు లైన్ మార్పిడి చేపట్టలేదని గ్రామస్తులు రైతులు వాపోతున్నారు. ఈ సమస్య కారణంగా రైతులు, గ్రామ ప్రజలు తరచూ విద్యుత్ అంతరాయాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా, విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా ఉండేందుకు చెరువులోని 11 కేవీ విద్యుత్ లైన్‌ను వెంటనే ప్రత్యామ్నాయ మార్గంలోకి మార్చాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామ సర్పంచ్ శైలజ శివశంకర్ కోరారు.



# శ్రీ గణేష్ దేవస్థానంలో హుండీ లెక్కింపు..



- **రూ.31.27 లక్షలకు పైగా ఆదాయం**

**పటాన్చెరు, జూన్ 25**

పటాన్చెరు మండలం రుద్రారం గ్రామంలోని శ్రీ గణేష్ దేవస్థానంలో గురువారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి. రంగారావు, దేవస్థానం ఈవో ఎన్. లావణ్య, దేవస్థానం చైర్మన్ ఏ. హరి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగింది. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు రుక్మారెడ్డి, నరసింహ గౌడ్, మధుసూదన్ రెడ్డి, భక్తులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.మొత్తం 97 రోజుల హుండీ ఆదాయం రూ.29,72,351 కాగా, అన్నదానం హుండీ ద్వారా రూ.1,54,838 ఆదాయం లభించింది. దీంతో మొత్తం రూ.31,27,189 హుండీ ఆదాయం వచ్చినట్లు దేవస్థాన అధికారులు వెల్లడించారు.

# పేదల సొంతింటి కల సాకారం..

- **ఇందిరమ్మ ఇళ్లతో అభివృద్ధి దిశగా అడుగులు**
- **నిజాంపూర్‌లో గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న సీడీసీ చైర్మన్ గడిల రామ్ రెడ్డి**

**సదాశివపేట, జూన్ 25**

ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీడీసీ చైర్మన్ గడిల రామిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నిజాంపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం గ్రామ సర్పంచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గడిల రామిరెడ్డి నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి లబ్ధిదారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు.ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబం ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఈ, గ్రామపంచాయతీ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ నాయకులు భాస్కర్, మల్లేశం, వర్ధన్ రెడ్డి, వార్డు సభ్యుడు అనంతకృష్ణ, నల్ల బాలయ్య, నరసమ్మతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# 30 గిన్నిస్ ప్రపంచ రికార్డులతో చరిత్ర సృష్టించిన గీతం పూర్వ విద్యార్థిని

**పటాన్చెరు, జూన్ 25**

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ (2016–2020 బ్యాచ్) పూర్వ విద్యార్థిని శివాలి శ్రీవాస్తవ అరుదైన ఘనతను సాధించారు. ఒరిగామి, పేపర్ ఆర్ట్ రంగాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచిన ఆమె ఇప్పటివరకు 30 గిన్నిస్ ప్రపంచ రికార్డులు సాధించి చరిత్ర సృష్టించారు.ఇటీవల ఆమె తన తల్లిదండ్రులు కవితా శ్రీవాస్తవ, అనిల్ శ్రీవాస్తవతో కలిసి మరో 7 కొత్త గిన్నిస్ ప్రపంచ రికార్డులను అధికారికంగా అందుకున్నారు. దీంతో వారి కుటుంబం సాధించిన మొత్తం గిన్నిస్ రికార్డుల సంఖ్య 30కు చేరింది. ఈ ఘనతతో భారతదేశంలో అత్యధిక గిన్నిస్ ప్రపంచ రికార్డులు కలిగిన వ్యక్తిగా శివాలి నిలిచారు.లక్షలాది కాగితపు కళాఖండాలను అత్యంత నైపుణ్యంతో రూపొందించి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన శివాలి ప్రయాణం సృజనాత్మకత, అంకితభావం, కచ్చితత్వం, పట్టుదలకు నిదర్శనంగా నిలిచింది.ఈ చారిత్రాత్మక విజయంపై గీతం యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ శివాలి, ఆమె కుటుంబ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. కళ, ఆవిష్కరణ, సృజనాత్మకత ద్వారా భారతదేశానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకొస్తున్న ఆమె మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



# ఎమ్మెల్యే దరఖాస్తు ఉన్నా పురాతన ఎమ్మార్వో కార్యాలయం కూల్చివేత ఎందుకు?

- **ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని డిమాండ్..**
- **ప్రజలకు సమాధానం చెప్పాలని ఎమ్మెల్యేపై ఎమ్మార్పీఎస్ డిమాండ్..**

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 25 :**

జగిత్యాల పట్టణ కేంద్రంలో ఉన్న పురాతన ఎమ్మార్వో కార్యాలయ భవనాన్ని అధికారులు కూల్చివేయడంపై ఎమ్మార్పీఎస్ జగిత్యాల జిల్లా కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గురువారం కూల్చివేసిన స్థలాన్ని సందర్శించిన సందర్భంగా జిల్లా అధ్యక్షులు దుమాల గంగారాం మాదిగ మాట్లాడుతూ చారిత్రక, పురాతన కట్టడాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉండగా వాటిని కనుమరుగు చేయడం బాధాకరమన్నారు. ఈ భవనాన్ని పరిరక్షించాలని స్థానిక ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు ఇచ్చినట్లు తెలిసినా అధికారులు కూల్చివేయడం పలు అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే దరఖాస్తుకు విలువ లేదా? లేక ఆయనకు తెలియకుండానే అధికారులు చర్యలు చేపట్టారా? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని అన్నారు. కూల్చివేసిన స్థలంలో ప్రైవేట్ సంస్థలకు లేదా ఇతర వాణిజ్య అవసరాల కోసం భూమిని కేటాయించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు. జిల్లాలోని ఇతర పురాతన కట్టడాల పరిరక్షణ విషయంలో కూడా ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. జగిత్యాల ప్రజల భావోద్వేగాలకు సంబంధించిన ఈ అంశంపై ఎమ్మెల్యే ప్రజలకు స్పష్టత ఇవ్వాలని, ప్రభుత్వ ఆస్తులను కాపాడే చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రజలను ఏకం చేసి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి బెజ్జంకి సతీష్ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షులు బోనగిరి కిషన్ మాదిగ, జిల్లా కార్యదర్శి సంగెపు మత్తు మాదిగ, జిల్లా సంయుక్త కార్యదర్శి బదనపల్లి సురేష్ మాదిగ, జగిత్యాల నియోజకవర్గ కో-కన్వీనర్ కొడేటి సునీల్ మాదిగ, నరేష్ మాదిగ, మల్లేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



# రైతు ఆశీర్వాద సభ జయప్రదానికి రైతులు పాటుపడాలి

- **సర్ ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..**
- **సింగరేణి మండల కాంగ్రెస్ సన్నాహక సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు..**

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో, జూన్ 25 :**

ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గంలోని సింగరేణి మండలం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 30న చింతకాని మండలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గోననున్న రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని కోరారు. వైరా నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు..ఈ సభ వేదిక నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్నదాతలకు 9 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా నిధులు విడుదల చేయనున్నారని పేర్కొన్నారు. రైతు శ్రేయస్సే ధ్యేయంగా పని చేస్తున్న ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, సింగరేణి మండల రైతులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.. అదేవిధంగా ఓటర్ల జాబితా నమోదు, సవరణలు, మ్యాపింగ్ ప్రక్రియపై కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. బీహార్, పశ్చిమ బెంగాల్ తరహాలోనే తెలంగాణలోను స్పెషల్ ఇంటెన్సివ్ తరహాలోనే తెలంగాణలోను స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో ఓటు హక్కులకు ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా క్షేత్ర స్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మొక్క శేఖర్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాంబాబు, పగడాల మంజూల, మేకల రాంమూర్తి, చంద్రప్రకాష్, ఐలయ్య, సర్పంచులు మేదరి టోనీ, వీసాల వెంకటేశ్వర్లు, రాందాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



చురకలు



# ప్రభుత్వ ఆసుపత్రి వర్కర్లపై కక్ష సాధింపు చర్యలు ఆపాలి

సీఐటీయూ




పటాన్‌చెరు, జూన్ 25

ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వర్కర్లపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను వెంటనే బదిలీ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి. నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం పటాన్‌చెరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం రిలే నిరాహార దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆసుపత్రిలో సుమారు 40 మంది వర్కర్లు గత 15 సంవత్సరాలుగా పేషంట్ కేర్, ల్యాబ్ అసిస్టెంట్, అటెండర్, సెక్యూరిటీ, శానిటేషన్ తదితర విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నప్పటికీ నెలకు కేవలం రూ.11 వేల వేతనం మాత్రమే అందుకుంటున్నారని తెలిపారు.గత ప్రభుత్వం ప్రకటించిన రూ.15,800 కనీస వేతనం కూడా అమలు కావడం లేదని, కాంట్రాక్టర్లు కార్మికులకు రావాల్సిన వేతనాల్లో కోత విధించి అక్రమ లాభాలు పొందుతున్నారని ఆరోపించారు. అలాగే, ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.ఆమెను వెంటనే పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రి నుంచి బదిలీ చేయాలని, కార్మికులకు ప్రతి నెలా సమయానికి జీతాలు చెల్లించాలని, కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. యూనిఫాం, ఈఎస్ఐ, పీఎఫ్ తదితర చట్టబద్ధమైన సౌకర్యాలను పూర్తిస్థాయిలో కల్పించాలని కోరారు.ఆసుపత్రి వర్కర్లకు భోజనశాల, విశ్రాంతి గది వంటి ప్రాథమిక సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని, కార్మికుల డిమాండ్లు నెరవేరకపోతే భవిష్యత్తులో 'చలో హైదరాబాద్' కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రి కమిటీ సలహాదారు ప్రభాకర్, అధ్యక్షుడు సతీష్, ట్రెజరర్ స్వామి, కార్యదర్శి ఎం. అరుణ, రాంబాయి, రవి, నాగమణి, అంజమ్మ, సత్యనారాయణ, గోపాల్, రాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్ విద్యార్థిని ధనుజకు రాష్ట్ర స్థాయి ప్రశంసలు

సిద్దిపేట రూరల్, జూన్ 25

ఇబ్రహీంనగర్ తెలంగాణ మోడల్ స్కూల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక సెషన్‌లో ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమంలో విశేష నైపుణ్యాలు ప్రదర్శించిన విద్యార్థిని ధనుజను రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించి గురువారం ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యతో పాటు విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ వారికి అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. పీజీటీ రజినితో పాటు ఉపాధ్యాయ బృందం సమిష్టి కృషితో విద్యార్థులను వివిధ రంగాల్లో ప్రోత్సహిస్తూ ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ చేతుల మీదుగా ధనుజ ప్రశంసాపత్రం అందుకోవడం పట్ల పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని, ఆమెను ప్రోత్సహించిన ఉపాధ్యాయ బృందాన్ని పలువురు అభినందించారు.




# రాజకీయ లబ్ది కోసం ముంపు బాధితులను వాడుకోవద్దు

- ముంపు గ్రామాల అభివృద్ధికి పెండింగ్ పరిహారాలు, ప్యాకేజీలను అందించుటకు చొరవ చూపండి
- రాజకీయాలను పక్కన పెట్టి ఐక్యంగా ముంపు గ్రామాల సమస్యలు పరిష్కారమయ్యే వరకు కలిసి నడుద్దాం
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి డిమాండ్



గజ్వేల్ ప్రతినిధి, జూన్ 25

మల్లన్న సాగర్ ముంపు గ్రామాల అభివృద్ధికి బాధితులకు అండగా అన్ని రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు గజ్వేల్ పట్టణ ప్రజలు, ప్రభుత్వ అధికారులు అండగా ఉండాలని, వారి సమస్య పరిష్కారం కోసం ఐక్యంగా అన్ని వర్గాల వారు కలిసి రావాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం ముంపు గ్రామాల ప్రజలను మాయ మాటలు చెప్పి మోసపూరిత విధానాలతో గ్రామాలను ఖాళీ చేపించి పూర్తిస్థాయిలో నష్టపరిహారాలు, ప్యాకేజీలు కాలనీలో మౌలిక వసతులు కల్పించలేదని అన్నారు. గతంలో ముంపు బాధితుల పక్షాన గొంతు విప్పిన ప్రస్తుత అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ముంపు గ్రామాల అభివృద్ధిపై వారికి రావలసిన నష్టపరిహారాలు, ప్యాకేజీలు అందించడంలో ఓపెన్ ప్లాట్లు, ఇచ్చిన ఇండ్లను రిజిస్ట్రేషన్ చేయించడంలో నిర్లక్ష్యం వహిస్తుందని, ప్రస్తుత బీజేపీ పార్లమెంటు సభ్యులు గతంలో ముంపు గ్రామాల పక్షాన ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించి ఉన్నప్పటికీ బాధితుల సమస్యలపై సరైన విధంగా స్పందించడం లేదని, పరిష్కారానికి కృషి చేయడం లేదని అన్నారు. ఇలాంటి సందర్భంలో ప్రధాన రాజకీయ పార్టీలు వారి రాజకీయ లబ్ధికోసం ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారని, ఆ రాజకీయాలలో ముంపు గ్రామ ప్రజలు బలికావద్దని, ఇప్పటికైనా అన్ని రాజకీయ పార్టీలు ప్రజాసంఘాలు, ముంపు గ్రామాల ప్రజలు గజ్వేల్ పట్టణ ప్రజలు సర్వస్వం త్యాగం చేసిన ముంపు గ్రామ ప్రజల పక్షాన అండగా నిలబడాలని అన్నారు. ముంపు గ్రామ ప్రజల గృహ నిర్మాణాల పర్మిషన్, టాక్సీ మినహాయింపులు చట్టపరమైన పద్ధతిలో నిర్ణయించాలని, దొడ్డి దారిలో వసూళ్ల కార్యక్రమాలు చేపట్టవద్దని ముంపు గ్రామ ప్రజల మధ్య చిచ్చుపెట్టే పద్ధతులు చేయొద్దని, ఏదైనా విషయం ఉంటే అవగాహన కల్పించాలని ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు వెళ్లాలని అధికారులను హెచ్చరిస్తున్నామన్నారు. ముంపు గ్రామాలలోని యువతి యువకులకు ఉపాధి అవకాశాల కోసం ప్రభుత్వాధికారులు ప్రణాళికలు తయారు చేయాలని డిమాండ్ చేశారు. ముంపు గ్రామాల కాలనీలో కనీస మౌలిక వసతులు నీటి సరఫరా, వీధిలైట్లు, మురుగు కాలువల శుద్ధి, రోడ్లు వంటి పనుల కోసం మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ చర్యలు చేపట్టాలని కోరారు.

# శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థాన రాజగోపురం నిర్మాణ భూమిపూజలో పాల్గొన్న శంభీపూర్ క్రిష్ణ



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 25 :

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ మల్లంపేట్‌లోని శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో రాజగోపురం నిర్మాణానికి నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శంభీపూర్ క్రిష్ణ మాట్లాడుతూ, వీరాంజనేయ స్వామి దేవస్థాన రాజగోపురం నిర్మాణానికి నిర్వహిస్తున్న భూమిపూజ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి భక్తుల సహకారం, ప్రజాప్రతినిధుల మద్దతు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్లు మాదాస్ వెంకటేష్, షామీర్పేట్ హనుమంతరావు, ఎంబరి ఆంజనేయులు, విష్ణువర్ధన్ రెడ్డి, బందారి మహేందర్, సీనియర్ నాయకులు కొల్తూరు మల్లేష్ ముదిరాజ్, మాదాస్ నర్సింగరావు, కుంట్ల నందు, మాదాస్ నవీన్, షామీర్పేట్ ప్రకాష్, శ్రీనివాస్ గుప్తా, కుమ్మరి ప్రశాంత్, దుశకంటి కుమార్, సబితా జలందర్ రెడ్డి, అనిల్ రెడ్డి, శివకాంత్, మాదాస్ ఆదిత్య, వంశీ, శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సవరణ సర్ ను కాంగ్రెస్ శ్రేణులు విజయవంతం చేయాలి

- పార్టీ కోసం పనిచేసిన వారికే గుర్తింపు, పదవులు
- డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క
- సర్ ఫైవ్ జైనూర్ లో కాంగ్రెస్ నాయకులతో సమావేశం





ఆసిఫాబాద్ ప్రతినిధి, జూన్ 25

కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఓటరు జాబితా ప్రత్యేక సవరణ సర్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం చేయాలని, పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపు పదవులు దక్కుతాయని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క అన్నారు. జైనూర్ మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా నాయకులు, బీఎల్ఏలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గ్రామాల వారీగా ఓటరు జాబితాలను పరిశీలించి అర్హులైన వారి పేర్లు తొలగించబడకుండా చూడాలని అన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సీరియస్‌గా ఉన్నారని, పార్టీ నాయకులు దీనిని అత్యంత బాధ్యతగా తీసుకుని పనిచేయాలని సుగుణక్క పేర్కొన్నారు. గ్రామ, మండల స్థాయిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని, ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, సవరణల ప్రక్రియలో పార్టీ శ్రేణులు చురుకుగా పాల్గొనాలని కోరారు.

# భూవమా తల్లి మొక్కులు తీర్చుకున్న ఎమ్మెల్యే కోవా లక్ష్మి



ఆసిఫాబాద్ ప్రతినిధి, జూన్ 25

పుంజుమేరగూడ (రెబ్బెన)లో మొహర్రం ఉత్సవాలకు భాగంగా శ్రీ శ్రీ శ్రీ భువమా తల్లి దేవస్థానం జూన్ 25 పెద్ద సరిగెత్తు సందర్భంగా ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి భువమా తల్లి మొక్కులు సమర్పించుకున్నారు. అనంతరం దేవస్థానం కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకి సన్మానం చేశారు. అనంతరం దేవస్థానం అధ్యక్షుడు మాట్లాడుతూ గురువారం పెద్ద సరిగెత్తు సాయంత్రం వచ్చే భక్తులకు అన్నదానం, తాగునీరు, పార్కింగ్ తదితర సౌకర్యాలను పోలీస్ సిబ్బంది, సహకరిస్తున్న సంబంధించిన నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన గ్రామ సర్పంచ్, దుర్గం భరద్వాజ్, పరకాల సాగర్ గౌడ్, పాక్స్ చైర్మన్, కార్యాధర సంజు, మాజీ ఉపసర్పంచ్, బొమ్మినేని శ్రీధర్, వర కృష్ణ గజ్జల సత్యనారాయణ, రాపర్తి అశోక్, వస్త్రం నాయక్, మహిళా నాయకురాలు, అన్నపూర్ణ అరుణ, మురళి మన్యం పద్మ, ఎల్కటి జైస్వాల్, శంకరమ్మ, నికోడే శ్రీకర్ స్వాపకుడు, వినోద్ జైస్వాల్, ప్రెసిడెంట్, గుర్లె బాలాజీ, పదాయ శివరాం, వీసయ్య, భీమ్ రావ్, నికోడే శ్రీకాంత్, వెంకటి, నిమ్మాజీ, భగవాన్, రాకేష్, బొడ్డు రాజు, సిద్ధార్థ, నాగరాజు, చింటూ, తదితరులు పాల్గొన్నారు.

# కృషి హై స్కూల్‌లో మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 25 :

సూరారం కాలనీలోని కృషి హై స్కూల్‌లో గురువారం మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూరారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుధీర్ కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా మంచి అలవాట్లను పెంపొందించుకొని, విద్యపై శ్రద్ధ పెట్టి చదివితే ఉజ్వల భవిష్యత్తు సాధించవచ్చని తెలిపారు. నేటి బాలలే రేపటి పౌరులని, దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలను వినియోగించే వారితో పాటు వాటిని ప్రోత్సహించే వ్యక్తులకు కూడా దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. సమాజంలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కలిగి, ఇతరులకు కూడా తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల ఎస్ఐ ఎం. రాజు, కృషి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చలో కోకాపేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

గజబింకార్ అశోక్ దాదా



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూన్ 25

కోకాపేటలో ఆరెకటిక సమాజానికి రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించడం సమాజానికి గౌరవాన్ని తీసుకొచ్చే శుభ పరిణామమని ఆరెకటిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజబింకార్ అశోక్ దాదా అన్నారు. గురువారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో సిద్దిపేట ఆరెకటిక సంఘం అధ్యక్షుడు గజబింకార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జూలై 10న నిర్వహించనున్న శ్రీ రేణుకా మాత కల్యాణ మహోత్సవం-లో కోకాపేట కార్యక్రమానికి సంబంధించిన కరపత్రికను ఆయన సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్ దాదా మాట్లాడుతూ శ్రీ రేణుకా మాత ఆరెకటిక సమాజానికి ఆరాధ్య దైవమని, ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో మహోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందన్నారు. 2022లో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో తొలిసారిగా మహోత్సవాలు నిర్వహించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఆరెకటిక కులస్తులు, భక్తులు, సంఘం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారని తెలిపారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఆరెకటిక కుటుంబం జూలై 10న జరిగే ఈ మహోత్సవంలో పాల్గొని "చలో కోకాపేట్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాస్, బాలకిషన్, శంకర్ లాల్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# తీర ప్రాంత పరిరక్షణలో నౌకాదళ అసమాన సేవలు

## నేడు వారుణాస్త్ర భారత దేశ నౌకా దళంలో చేరిన దినం

భారత నావికాదళం దేశం యొక్క సముద్ర సరిహద్దులను భద్ర పరచుటలో, ఓడరేవు సందర్శనల ద్వారా, భారతదేశం అంతర్జాతీయ సంబంధాలను విస్తరించుటంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. భారతదేశ నావికా దళం భారత సైనిక దళాల యొక్క సముద్ర విభాగం. భారతదేశ రాష్ట్రపతి నౌకాదళానికి సర్వ సైన్యాధ్యక్షుడు. కేవలం దేశ రక్షణకే కాకుండా మానవతా సహాయాలకు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నపుడు సహాయం కొరకు భారత ప్రభుత్వం నేవీని వినియోగిస్తుంది. ఉమ్మడి వ్యాయామాలు, మానవతావాద మిషన్లు, విపత్తు ఉపశమనం మొదలైనవి వారి కర్తవ్యాలు. భారత దేశంలో క్రీ. పూ. 2300లో ప్రస్తుత గుజరాత్ లోని మంగ్రోల్ దగ్గర మొట్టమొదటి నౌకాతీరం నిర్మించ బడినది. క్రీ.పూ. 4వ శతాబ్దంలో మౌర్య సామ్రాజ్యంలో మొదటిసారి నౌకా విభాగాన్ని ఏర్పరిచారు. చంద్రగుప్త మౌర్యుడి ప్రధాన మంత్రి అయిన చాణక్యుడు తాను రచించిన అర్ధ శాస్త్రంలో నవాధ్యక్ష పేరుతో నదీ జలాల వినియోగం గురించి నిర్దేశించాడు. బ్రిటిషు ప్రభుత్వం భారత దేశాన్ని పాలిస్తున్నప్పుడు 1830లో రాయల్ ఇండియన్ నేవిని ఏర్పరిచారు. ఇది 1946 నాటికి 78 ఓడలు, 2000 మంది నిబ్బంది కలిగి ఉండేది. 26 జనవరి 1950 న భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చిన రోజున నౌకా దళానికి ఇండియన్ నేవిగా, వాహకాలకు ఇండియన్ నావల్ షిప్ గా పేరు పెట్టారు.

1961లో జరిగిన ఆపరేషన్ విజయ్ లో ఇండియన్ నేవి మొట్ట మొదటి సారి యుద్ధంలో పాల్గొన్నది. 1965లో జరిగిన భారత్ – పాక్ యుద్ధంలో నేవి ఎక్కువ పాల్గొనక పోయిన తీర ప్రాంతాల పరిరక్షణలో కీలకపాత్ర వహించింది. 1971లో జరిగిన భారత్ – పాక్ యుద్ధంలో నేవి విశిష్టమైన పాత్ర పోషించింది. ఈ యుద్ధంలో పాకిస్తాన్ దగ్గర ఉన్న అత్యంత ప్రమాదకరమైన పి ఎన్ ఎస్ ఘాజి జలాంతర్గామిని ధ్వసం చేసి సముద్రంలో ముంచి వేసిన ఘనత ఐ ఎన్ ఎస్

– రాజ్ పుత్ కు దక్కుతుంది. ఐ ఎన్ ఎస్ నిర్ఘాట్, ఐ ఎన్ ఎస్ నిపత్ లు కరాచీ పోరను చుట్టిముట్టి మిగిలిన పాకిస్తాన్ పోర్టులతో రాకపోకలను, పాక్ సైన్యానికి సహాయాన్ని అడ్డుకొని భారత దేశానికి విజయాన్ని అందించడంలో ముఖ్యపాత్ర వహించాయి. 2004లో దక్షిణ భారత దేశాన సునామి సంభవించి నపుడు కొద్ది గంటల్లోనే నేవి 27 నౌకలు, 19 హెలీకాప్టర్లు, 06 యుద్ధ విమానా నౌకలు, 5000 మంది సిబ్బందితో ముందుగా సహాయ చర్యలు చేపట్టింది. నేవి చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున సహాయ చర్యలు చేపట్టడం ఇదే ప్రథమం.

ఆధునిక భారతీయ నౌకాదళం హిందూ మహాసముద్ర ప్రాంతంలో తన స్థానాన్ని మెరుగు పరిచేందుకు వేగవంతమైన పునర్నిర్మాణంలో భాగంగా ఉంది. ఈ నివేదిక ప్రకారం 58,000 మంది సిబ్బంది, విమాన వాహక నౌక, పెద్ద రవాణా ఓడ, 15 యుద్ధ నౌకలు, 8 గైడెడ్ మిస్సైల్ డిస్ట్రాయర్లు, 24 కొర్వెట్టెలు, 13 సంప్రదాయ జలాంతర్గాములు, 1 అణు దాడి జలాంతర్గామి, 30 పెట్రోల్ ఓడలు, వివిధ సహాయక నౌకలు మొదలైనవి భారత నావికా దళంలో భాగం. భారత నావికా దళంలో తూర్పు కమాండ్ – విశాఖపట్నం, పశ్చిమ కమాండ్ – ముంబాయి దక్షిణ కమాండ్ – కోచి, అండమాన్ నికోబార్ నావల్ – పోర్ట్ బ్లెయిర్ అనే 4 కమాండ్ లు ఉన్నాయి. 1985 నుండి అణు జలాంత ర్గాములను నిర్మించడానికి కల్పాక్కం వద్ద ఉన్న అణు కేంద్రంతో కలసి నేవి కృషి చేస్తోంది. 1987లో భారత నౌకా దళంలో జలాంతర్గాముల విభాగాన్ని ఏర్పాటు చేశారు. జలాంత ర్గాముల నుండి టర్పిడో అను క్షిపణులను ప్రయోగిస్తారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన మొట్ట మొదటి సబ్ మెరైన్ – ఐ ఎన్ ఎస్ షల్కి. 8 డిసెంబర్ 1967లో భారత నౌకా దళంలో ప్రవేశ పెట్టబడిన తొలి జలాంతర్గామి – ఐ ఎన్ ఎస్ కల్వరి.

జలయుద్ధం చేయాల్సి వచ్చినప్పుడు, భారత నావికా దళానికి ఎంతగానో ఉపకరిస్తుందని భావిస్తున్న ఎలక్ట్రానిక్ టోర్పెడో 'వారుణాస్త్ర' స్వదేశీ పరిజ్ఞానంతో భారత్ అభివృద్ధి చేసిన జలాంతర్గామి విధ్వంసక టార్పెడో. భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థకు చెందిన నేవల్ సైన్స్ అండ్ టెక్నొలాజికల్ లేబొరేటరీ ఈ హెవీవెయిట్ టార్పెడోను అభివృద్ధి చేసింది. సముద్ర గర్భంలో... శత్రు దేశపు సబ్ మెరైన్ ధ్వంసం చేసే టార్పెడో ఇది. ఓడనుండి ప్రయోగించే రకపు వారుణాస్త్రను 2016 జూన్ 26న న భారత నౌకాదళంలో చేర్చుకున్నారు. యుద్ధ నౌక నుంచే ఈ హెవీ వెయిట్ టార్పెడోను సముద్రంలో దాగి ఉన్న శత్రు దేశపు జలాంతర్గామిపై ప్రయోగించవచ్చు. 95 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో తయారైంది. ప్రపంచంలో జీపీఎస్ ఆధారంగా దూసుకుపోయే ఏకైక టార్పెడోగా వారుణాస్త్ర వినుతికెక్కింది. ఐ ఎన్ ఎస్ కల్వరి – 14 డిసెంబర్ 2017న, ఖండేరి సెప్టెంబర్ 2019న, కరంజ్ మార్చి 2021న, వేలా నవంబర్ 2021న, వాగిర్– నవంబర్ 2020లో ప్రారంభించ బడింది. 2023 జనవరి 23న వగీర్ జల ప్రవేశం చేయడంతో, భారత నౌకాదళంలో చేరి, భారతదేశం జలాంతర్గామి నిర్మాణ దేశంగా తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. వగీర్ అంటే ఇసుక సొరచేప. ఐఎన్ఎస్ వగీర్లో ప్రపంచంలోని అత్యుత్తమ సెన్సార్లు ఉన్నాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# మాదక ద్రవ్యాల వినియోగానికి అడ్డుకట్ట అనివార్యం

## నేడు మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం




ప్రపంచ వ్యాప్తంగా మానవ సమాజాన్ని పట్టిపీడిస్తున్న అతిపెద్ద సామాజిక, ఆరోగ్య, ఆర్థిక సమస్యలలో మాదక ద్రవ్యాల దుర్వినియోగం ఒకటి. వ్యక్తిగత జీవితాలను ఛిన్నాభిన్నం చేయడమే కాకుండా కుటుంబ వ్యవస్థలను, సామాజిక సంబంధాలను, దేశాల ఆర్థిక వ్యవస్థలను సైతం దెబ్బతీస్తున్న ఈ దురాచారాన్ని అరికట్టేందుకు ప్రపంచ దేశాలు నిరంతరం పోరాడుతున్నాయి. మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, వ్యాపారాన్ని నిరోధించాలనే సంకల్పంతో ప్రతి సంవత్సరం జూన్ 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 1987 డిసెంబర్ 7న ఐక్యరాజ్యసమితి సాధారణ సభ ఆమోదించిన తీర్మానం 42/112 ప్రకారం ఈ దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ప్రపంచాన్ని మాదక ద్రవ్యాల ముప్పు నుండి రక్షించాలనే లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి మాదక ద్రవ్యాలు మరియు నేరాల కార్యాలయం అనేక అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. మానవ చరిత్రలో మత్తు పదార్థాల వినియోగం కొత్తది కాదు. వేలాది సంవత్సరాలుగా కొన్ని మొక్కలు, పదార్థాలు ఔషధ అవసరాలకు, కొన్ని సాంప్రదాయ ఆచారాలకు ఉపయోగించబడుతున్నాయి. అయితే ఆధునిక కాలంలో వీటి వినియోగం వైద్య అవసరాలను దాటి వ్యసనంగా మారడం సమస్యకు మూల కారణమైంది. ముఖ్యంగా ఇరవయ్యో శతాబ్దం ద్వితీయార్థం నుండి హెరాయిన్, కొకైన్, ఎల్ఎస్డీ, సింథటిక్ డ్రగ్స్, మెథాంఫెటమైన్ వంటి రసాయనిక మాదక ద్రవ్యాల వ్యాప్తి ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేసింది. నేడు డ్రగ్స్ అక్రమ రవాణా అంతర్జాతీయ నేర ముఠాలకు కోట్లాది డాలర్ల ఆదాయ వనరుగా మారింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఐక్యరాజ్యసమితి నివేదికల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఏదో ఒక రూపంలో మాదక ద్రవ్యాలను వినియోగిస్తున్నారు. యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్ విడుదల చేసిన వరల్డ్ డ్రగ్ రిపోర్ట్ ప్రకారం ప్రపంచంలో సుమారు 29 కోట్ల మందికి పైగా మాదక ద్రవ్యాలను వినియోగించిన అనుభవం ఉంది. వీరిలో కోట్లాది మంది వ్యసన రుగ్మతలతో బాధపడుతున్నారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది మాదక ద్రవ్యాల కారణంగా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రాణాలు కోల్పోతున్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, ప్రమాదాలు, హింసాత్మక సంఘటనలు, నేరాలు, ఆత్మహత్యలు ప్రపంచ ఆరోగ్య వ్యవస్థలపై తీవ్ర భారాన్ని మోపుతున్నాయి. భారతదేశంలో కూడా మాదక ద్రవ్యాల సమస్య క్రమంగా విస్తరిస్తోంది. ఒకప్పుడు సరిహద్దు ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన ఈ సమస్య ఇప్పుడు పట్టణాలు, చిన్న నగరాలు, గ్రామీణ ప్రాంతాలకు కూడా వ్యాపించింది. ముఖ్యంగా యువతలో డ్రగ్స్ వినియోగం పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. గతంలో ఇరవై నుంచి ఇరవై అయిదేళ్ల వయస్సులో వ్యసనాలకు గురయ్యే వారు ఇప్పుడు పదిహేను నుంచి పదిహేడేళ్ల వయస్సులోనే మాదక ద్రవ్యాల బారిన పడుతున్నట్లు అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, మహిళలు, వృత్తి నిపుణులు కూడా ఈ వ్యసనానికి బలవుతున్నారు. మాదక ద్రవ్యాలు మనిషి మెదడు పనితీరుపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయి. మెదడులో డోపమైన్, ఎండార్ఫిన్స్ వంటి రసాయనాల విడుదలను అసహజంగా పెంచడం ద్వారా తాత్కాలిక ఆనందాన్ని కలిగిస్తాయి. అయితే కొంతకాలం తర్వాత సహజసిద్ధమైన ఆనందాన్ని పొందే సామర్థ్యం తగ్గిపోతుంది. ఫలితంగా అదే మత్తును పొందేందుకు మరింత ఎక్కువ మోతాదులో మాదక ద్రవ్యాలను వినియోగించాల్సి వస్తుంది. ఈ పరిస్థితి వ్యసనానికి దారితీస్తుంది. ఒకసారి బానిసగా మారిన తర్వాత మాదక ద్రవ్యాలు లభించని సందర్భంలో తీవ్ర ఆందోళన, చిరాకు, నిరాశ, నిద్రలేమి, శారీరక బలహీనత, మానసిక అస్థిరత వంటి లక్షణాలు కనిపిస్తాయి. మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు కేవలం వ్యక్తికే పరిమితం కావు. కుటుంబాలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతాయి. వ్యసనానికి బానిసైన వ్యక్తులు కుటుంబ సభ్యులతో ఘర్షణలకు దిగడం, ఆర్థిక వనరులను వృథా చేయడం, కుటుంబ బంధాలను దెబ్బతీయడం సాధారణంగా కనిపించే అంశాలు. అనేక కుటుంబాలు అప్పులపాలవడం, విడాకులు, కుటుంబ విచ్ఛిన్నాలు, గృహ హింస వంటి సమస్యలకు గురవుతున్నాయి. సమాజంలో నేరాల పెరుగుదలకు కూడా మాదక ద్రవ్యాలు ప్రధాన కారణాలలో ఒకటిగా నిలుస్తున్నాయి. యువతలో మాదక ద్రవ్యాల వినియోగానికి అనేక కారణాలు ఉన్నాయి. స్నేహితుల ప్రభావం, కొత్త అనుభవాల పట్ల కుతూహలం, చదువుల ఒత్తిడి, ఉద్యోగ పోటీ, కుటుంబ కలహాలు, మానసిక ఆందోళనలు, నిరుద్యోగం, సామాజిక మాధ్యమాల ప్రభావం వంటి అంశాలు యువతను ఈ దురలవాట్ల వైపు నెడుతున్నాయి. కొందరు తమ సమస్యలను మరచిపోవడానికి, మరికొందరు ఫ్యాషన్‌గా భావించి, ఇంకొందరు సాహసంగా భావించి మాదక ద్రవ్యాలను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల సింథటిక్ డ్రగ్స్ వినియోగం పెరుగుతుండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. అంతర్జాతీయ డ్రగ్ ముఠాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కొత్త మార్గాల్లో అక్రమ రవాణా నిర్వహిస్తున్నాయి. సరిహద్దులు, సముద్ర మార్గాలు, ఆన్‌లైన్ వేదికలు కూడా డ్రగ్స్ వ్యాపారానికి వినియోగించబడుతున్నాయి. ఈ సమస్యను ఎదుర్కొనేందుకు భారత ప్రభుత్వం నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రాపిక్ సబ్‌స్టాన్సెస్ చట్టాన్ని అమలు చేస్తోంది. ఈ చట్టం ప్రకారం మాదక ద్రవ్యాల ఉత్పత్తి, రవాణా, విక్రయం, నిల్వ, వినియోగం వంటి చర్యలు కఠిన శిక్షార్హమైన నేరాలు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, పోలీసు శాఖలు, కస్టమ్స్ విభాగాలు, ఇతర దర్యాప్తు సంస్థల ద్వారా అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. అయినప్పటికీ సమస్య పూర్తిగా అదుపులోకి రావడం లేదు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో చట్టాల కంటే అవగాహన మరింత కీలకం. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు విద్యార్థులకు మాదక ద్రవ్యాల ప్రమాదాలపై నిరంతర అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనించాలి. సమాజంలోని ప్రతి వర్గం ఈ సమస్యను కేవలం వ్యక్తిగత సమస్యగా కాకుండా సామాజిక బాధ్యతగా గుర్తించాలి. ముఖ్యంగా వ్యసనానికి గురైన వారిని నేరస్థులుగా కాకుండా బాధితులుగా పరిగణించి వారికి వైద్య చికిత్స, మానసిక సలహా, పునరావాస సేవలు అందించాలి. జూన్ 26 అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదు; సమాజాన్ని అప్రమత్తం చేసే హెచ్చరిక కూడా. మాదక ద్రవ్యాలు ఆరోగ్యాన్ని నాశనం చేస్తాయి, కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తాయి, యువత భవిష్యత్తును చీకటిలోకి నెడతాయి, దేశ ప్రగతికి అడ్డంకిగా మారతాయి. అందువల్ల ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, కుటుంబాలు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా, పౌర సమాజం సమన్వయంతో పనిచేసి మాదక ద్రవ్యాల వినియోగానికి అడ్డుకట్ట వేయాలి. వ్యసన రహిత యువత, ఆరోగ్యవంతమైన కుటుంబాలు, సురక్షిత సమాజం, సుసంపన్న దేశం అనే లక్ష్యాన్ని సాధించాలంటే మాదక ద్రవ్యాలపై పోరాటాన్ని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా స్వీకరించాల్సిన అవసరం ఉంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# త్యాగానికి ప్రతీక మొహర్రం



హిందువులు, ముస్లిం సోదరులూ సమిష్టిగా జరుపుకునే మొహర్రం ప్రత్యేకత సంతరించుకుంది. త్యాగానికి, మహోన్నత సనాతన సాంప్రదాయానికి, మత సామరస్యానికి ప్రతీక మొహర్రం వేడుక. ధర్మసంస్థాపన లక్ష్యంగా, నమ్మిన సిద్ధాంతాల కోసం పలువురు ప్రాణాలర్పించిన మాసం

మొహర్రం. ధర్మ సంస్థాపనార్థం హజ్రత్ ఇమామ్ హుస్సేన్, హసన్ లు తమ ప్రాణాలను అర్పించి 14 వందల సంవత్సరాలు గడిచినా అమరవీరుల త్యాగాన్ని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో స్మరిస్తూ, అమరుల త్యాగశీలతకు జోహార్లను అర్పించడం సత్సాంప్రదాయంగా ఆచరిస్తున్నారు. మొహర్రం మాసమంటే రక్తపు టేరులతో ఎర్రబారిన కర్బల మైదానం ముస్లిం సోదరుల కళ్లలో సజీవంగా సాక్షాత్కరిస్తుంది. ధర్మాధర్మాలకు జరిగిన సంఘర్షణ ఫలితమే కర్బల దుర్ఘటనగా ముస్లింలు భావిస్తారు. ఇస్లాం మత స్థాపకుడు ప్రవక్త మహమ్మద్ పరమపదించిన

అనంతరం సమ సమాజ స్థాపన కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో, సౌదీ అరేబియాలో తమ ప్రతినిధిని ఎన్నుకునే కార్యక్రమాన్ని చేపట్టారు. తదనుగుణంగా మదీనా రాజధానిగా గల రాజ్యానికి హజ్రత్ అబూబకర్ తొలి ఖలీఫాగా ఎన్నుకొనగా, అనంతరం హజ్రత్ ఉమర్, హజ్రత్ ఉస్మాన్ హజ్రత్ అలీలను ఖలీఫాగా ఎన్నుకున్నారు. వీరి పరిపాలన సమయంలో న్యాయం, ధర్మం నాలుగు పాదాలపై

నడిచాయని చెపుతారు. ధార్మిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో సమానత్వం వెల్లి విరిసిందంటారు. ఐదవ ఖలీఫాగా ప్రజలు ఇమాం హుస్సేన్ తమ ప్రతినిధిగా ఎన్నుకోగా, సిరియా ప్రాంతానికి గవర్నరుగా ఉన్న హజ్రత్ మివాయా అధికార దాహంతో ఖలీఫా పదవిని ఆశించి

పోటీపడగా, ఇరువర్గాల మధ్య యుద్ధానికి నాంది పలికింది. యుద్ధ పరిణా మాలను గ్రహించిన హుస్సేన్, రక్తపాత నివారణకై రణరంగం నుండి నిష్క్రమించి, ప్రజలు తమకు విశ్వాసంతో కట్టెట్టిన అధికారాన్ని త్యాగం చేశారు. పదవీకాంక్షా లోలుడైన మివాయ తన కుమారునికి పట్టం కట్టాలని ప్రజలపై ఒత్తిడి తెచ్చిన స్థితిలో, ప్రాణభయంతో ప్రజలు మివాయ కొడుకు యజీద్ రాజుగా గుర్తిస్తారు. అయితే ఈ చర్యలు ప్రజాస్వామ్య వాదులకు మింగుడు పడలేదు. తత్ఫలితంగా ప్రజలు రాజుకు ఎదురు తిరిగి ఉద్యమిస్తారు. ఉద్యమ నాయకత్వ బాధ్యతలను హజ్రత్ హుస్సేన్ కి అప్పగిస్తారు. ఇస్లాం నిబంధనల ప్రకారం ఏసమస్య కైనా చర్చలు సంప్రదింపులే పరిష్కార మార్గాలు కావడం మూలంగా, హజ్రత్ హుస్సేన్ సిరియా రాజధాని కుఫాకు సంప్రదింపులకై బయలు దేరి వస్తుండగా, రాజు యజీద్ విషయాన్ని తెలుసుకుని హుస్సేన్ రాజధానికి వెళ్ళి చర్చలు జరిపితే తన అధికారానికి ముప్పు వాటిల్లక తప్పదని గ్రహించి, హుస్సేన్ ను అడ్డుకోవడానికి పెద్ద సైన్యాన్ని పంపుతాడు. మార్గ మధ్యలో కర్బల మైదానంలో యజీద్ సైన్యం ఎదురై హుస్సేన్ పరివారాన్ని అడ్డగిస్తారు. దీనితో ఇరువర్గాల మధ్య భీకర యుద్ధం జరుగుతుంది. హుస్సేన్ పరివారం శత్రు సైన్యాన్ని చీల్చి చెండాడినా, కొంతకాలం యుద్ధం జరిగాక చివరకు హుస్సేన్ ఒక్కడే మిగులగా, మొహర్రం మాసం లోని పదో తేదీ శుక్రవారం హిజ్రీ 60వ సంవత్సరం నాడు హుస్సేన్ హోరా హోరీగా పోరాడు తున్న సమయంలో, సూర్యుడు అస్తమించే సమయం కావడంతో, కొంత వ్యవధి కావాలని అనుమతి గైకొనగా, శత్రువులు అదే అదనుగా భావించి, నమాజ్లో భాగంగా సిజ్దా చేస్తుండగా బాణాలతో దారుణంగా హతమార్చి, తలను మొండెం నుంచి వేరు చేసి, చేతులు ఖండించి బాణాలకు, బరిసెలకు తగిలించుకుని నాట్య విన్యాసాలు చేశారు. అట్టిరోజును ఇస్లాం మతస్తులు త్యాగదినంగా పరిగణించి త్యాగ శీలతకు ప్రతీకగా పీర్ల దినాన్ని మొహర్రం పేరుతో జరుపు కుంటూ అమర వీరులను స్మరిస్తారు. మొహర్రంను హిందూ, ముస్లింలు సమైక్యంగా జరుపు కోవడం ఆనాదిగా సంప్రదాయంగా వస్తోంది. తెలుగు ప్రాంతాల్లో, మరీ ముఖ్యంగా నిజాం పాలిత ప్రాంతాల్లో మొహర్రం పండుగను ముస్లిములే కాక అన్ని వర్గాల ప్రజలూ జరుపుకోవడం వందలాది ఏళ్ళుగా సాగుతోంది. యాత్రా చరిత్ర కారుడు ఏనుగుల వీరాస్వామయ్య జూన్ 29, 1830న నిజాం పాలిత ప్రాంతాల్లో ప్రారంభమైన మొహర్రం పండుగను తాను రచించిన కాశీయాత్ర చరిత్రలో అభివర్ణించారు. మొహర్రం నెల పదవ రోజు యౌమీ ఆషూరా. ముహమ్మద్ ప్రవక్త మనుమడైన హుసేన్ ఇబ్న్ అలీ, కర్బలా యుద్ధంలో అమరుడైన రోజు. ముహర్రం నెలను, "షహీద్ " (అమర వీరుల ) నెలగా వర్ణిస్తూ, పండుగలా కాకుండా, వర్ధంతిలా జరుపు కుంటారు. షియా ఇస్లాంలో ఈ ముహర్రం నెల, "ఆషూరా", కర్బలా యుద్ధంలో మరణించిన వారి జ్ఞాపకార్థం, శోక దినాలుగా గడుపుతారు. షియాలు మాతమ్ (శోక ప్రకటన) జరుపుతారు. తెలంగాణలో పలుచోట్ల ఈ ముహర్రం పండుగను పీర్ల పండుగ అనే పేరుతో జరుపు కుంటారు. వారం రోజుల పాటు హిందూ, ముస్లిం సోదరులు కలిసి కట్టుగా పీర్లను పిల్లను నెలకొల్పి, చివరి రోజు వేలాదిమంది తోడురాగా వెళ్ళి పరి సమాప్తి గావిస్తారు. పీర్ల పండుగ సందర్భంగా సంతాన హీనులైన హిందూ స్త్రీలు మొక్కులు చెల్లించు కోవడం, పులుల ఇతర వేషాలతో విన్యాసాలు చేస్తూ, ఆడుతూ వారం డబ్బులు ప్రోగుచేసు కోవడం క్షేత్రం ఏటా అనుసరింప బడుతున్న సాంప్రదాయంగా మారింది. హైదరాబాద్ పాతబస్తీలో షియా ముస్లింలు తమను తాము హింసించు కుంటూ విషాదం వ్యక్తం చేస్తూ వూరేగింపులో పాల్గొంటారు. బీబీకా అలావా నుంచి ప్రారంభమై ఈ వూరేగింపు అలీజా కోట్ల, చార్మినార్, గుల్జార్ హౌస్, మీరాలం మండీ, దారుల్ షిఫాల మీదుగా కొనసాగి చాదర్ ఘాట్ వద్ద ముగుస్తుంది. శిక్షణ ఇచ్చిన ఏనుగుపై ఈ ఊరేగింపు సాగుతుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



## బంగారం తగ్గుముఖం

**హైదరాబాద్, జూన్ 25:** బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి శుభవార్త. దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు వరుసగా రెండో రోజూ తగ్గుదల నమోదు చేశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పడిపోవడం, అమెరికా డాలర్ బలపడటం, అలాగే అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై కఠిన వైఖరి కొనసాగవచ్చనే అంచనాలు ఈ తగ్గుదలకు కారణంగా భావిస్తున్నారు. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం గురువారం ఉదయం 10 గంటల సమయానికి హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,40,130 గా నమోదైంది. అలాగే లిలి22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర రూ.1,28,450 గా ఉంది. వెండి ధర కూడా తగ్గుతూ కిలోకు లిలిరూ.2,30,000 వద్ద ట్రేడ్ అవుతోంది. తెలంగాణలోని వరంగల్, నిజామాబాద్, ఖమ్మం వంటి ప్రధాన నగరాల్లో కూడా ఇదే స్థాయిలో ధరలు కొనసాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి నగరాల్లోనూ బంగారం ధరలు సమానంగా నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా చూస్తే చెన్నైలో ధరలు కొంత ఎక్కువగా ఉండగా, ముంబై, కోల్‌కతా, బెంగళూరు వంటి నగరాల్లో కూడా దాదాపు సమాన స్థాయిలోనే బంగారం ట్రేడ్ అవుతోంది. ఇక న్యూఢిల్లీ, జైపూర్ వంటి నగరాల్లో 24 క్యారెట్ల బంగారం ధర స్వల్పంగా ఎక్కువగా ఉంది. మొత్తంగా చూస్తే అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో బంగారం ధరలు తాత్కాలికంగా తగ్గుముఖం పట్టాయని నిపుణులు చెబుతున్నారు. కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది అనుకూల సమయమని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## ఇంధన ధరల్లో స్థిరత్వం

### వాహనదారులకు ఊరట

**హైదరాబాద్, జూన్ 25 :** వాహనదారులకు కొంత ఉపశమనం లభించింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల్లో హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరల్లో ఈరోజు ఎలాంటి మార్పు లేదు. ప్రభుత్వ చమురు సంస్థలు ప్రతి రోజు ఉదయం ఇంధన ధరలను సవరిస్తూ ఉంటాయి. అంతర్జాతీయ ముడి చమురు ధరలు, డాలర్ మారకం విలువ ఆధారంగా దేశవ్యాప్తంగా రేట్లు నిర్ణయించబడతాయి. రవాణా ఖర్చులు, స్థానిక పన్నులు కూడా ప్రతి రాష్ట్రంలో ధరల తేడాలకు కారణమవుతాయి. ప్రస్తుతం తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.115.69గా ఉండగా, డీజిల్ ధర రూ.103.82గా కొనసాగుతోంది. వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ వంటి నగరాల్లో కూడా దాదాపు ఇదే ధరలు అమల్లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో పెట్రోల్ ధర రూ.117.25గా ఉండగా, డీజిల్ ధర రూ.105.36గా ఉంది. విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి వంటి నగరాల్లో కూడా దాదాపు ఇదే స్థాయి ధరలు కొనసాగుతున్నాయి. ధరల్లో స్థిరత్వం రావడంతో రవాణా రంగం, టాక్సీ, ఆటో యజమానులకు కొంత ఊరట లభించింది. అయితే అంతర్జాతీయ ముడి చమురు ధరల మార్పుల ఆధారంగా భవిష్యత్తులో రేట్లు మారే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

వాహనదారులు ఇంధనం నింపే ముందు తాజా ధరలను తెలుసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ఎస్ఎంఎస్ సేవల ద్వారా కూడా సమీప బంక్ ధరలను తెలుసుకునే సౌకర్యం ఉంది.

## నిమిషాల్లో డెలివరీ విస్తరణ..

### అమెజాన్ నౌ సేవలు 300 నగరాలకు

**హైదరాబాద్, జూన్ 25 :** ఈ-కామర్స్ రంగంలో అమెజాన్ మరో కీలక అడుగు వేసింది. దేశవ్యాప్తంగా తన 'అమెజాన్ నౌ' నిమిషాల్లో డెలివరీ సేవలను 300 నగరాలకు విస్తరించనున్నట్లు సంస్థ అధికారికంగా ప్రకటించింది. ప్రతి త్రైమాసికంలో ఆర్డర్లు రెట్టింపు అవుతున్న వేగంతో, అమెజాన్ నౌ భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ-కామర్స్ విభాగంగా మారిందని సంస్థ తెలిపింది. అవసరమైన ఉత్పత్తులను కొన్ని నిమిషాల్లోనే వినియోగదారులకు చేరవేయడమే లక్ష్యంగా తమ లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌ను విస్తరిస్తున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం అమెజాన్ కిరాణా సరుకులు, పండ్లు, కూరగాయలు, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులు, ఫ్యాషన్, బ్యూటీ ఐటమ్స్, గృహోపకరణాలు వంటి వేలాది ఉత్పత్తులను నిమిషాల్లో లేదా గంటల్లో డెలివరీ చేస్తున్నది. అదే రోజు, మరుసటి రోజు డెలివరీ సేవలను కూడా పెద్ద ఎత్తున విస్తరిస్తోంది. ఈ విస్తరణలో భాగంగా సంస్థ డెలివరీ సిబ్బంది సంక్షేమం కోసం 'సమ్మాన్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం ద్వారా విద్యా సహాయం, బీమా కవరేజ్, రహదారి భద్రతా చర్యలు, ప్రభుత్వ ప్రయోజనాల ప్రాప్తి వంటి సౌకర్యాలు అందించనున్నట్లు అమెజాన్ తెలిపింది. అలాగే 'ఆశ్రయ్' విశ్రాంతి కేంద్రాలను 250 ప్రాంతాలకు విస్తరించనున్నట్లు సంస్థ ప్రకటించింది. ఇవి అన్ని డెలివరీ అసోసియేట్‌లకు అందుబాటులో ఉండనున్నాయి. బెంగళూరు, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, పుణె, హైదరాబాద్ సహా అనేక మెట్రో నగరాల్లో ఇప్పటికే 5 కోట్లకు పైగా వినియోగదారులకు సేవలు అందుతున్నాయని అమెజాన్ వెల్లడించింది.

# తెలుగువారి కంపెనీల్లో దివీస్ టాప్

**హైదరాబాద్, జూన్ 25 :** దేశంలోని అత్యంత విలువైన 500 ప్రైవేట్ కంపెనీల తాజా జాబితాలో తెలుగు కంపెనీలు బలమైన ప్రదర్శన కనబరిచాయి. హురున్ ఇండియా--బర్గండీ ప్రైవేట్ సంయుక్తంగా విడుదల చేసిన 2025 రిపోర్ట్‌లో మొత్తం 39 తెలుగు కంపెనీలు చోటు దక్కించుకున్నాయి. ఈ జాబితాలో దివీస్ లేబొరేటరీస్ రూ.1.72 లక్షల కోట్ల విలువతో మొదటి స్థానంలో నిలిచింది. డాక్టర్ రెడ్డీస్ రూ.1.10 లక్షల కోట్లతో రెండో స్థానాన్ని, మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (వీజు×ూ) రూ.83,800 కోట్లతో మూడో స్థానాన్ని సాధించాయి. రిపోర్ట్ ప్రకారం, గత ఐదేళ్లలో తెలుగు కంపెనీల మొత్తం విలువ రూ.12.1 లక్షల కోట్లకు పెరిగింది. ఇది 2021తో పోలిస్తే సుమారు 75 శాతం వృద్ధి. అదే సమయంలో కంపెనీల సంఖ్య 30 నుంచి 39కి పెరిగింది. రంగాల వారీగా చూస్తే హెల్త్‌కేర్ రంగం ఆధిపత్యం కొనసాగిస్తోంది. మొత్తం 16 కంపెనీలు ఈ విభాగానికి చెందినవే. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగం నుంచి 5 కంపెనీలు, ఇండస్ట్రియల్ ప్రొడక్ట్స్, ఆటోమొబైల్ రంగాల నుంచి 3 చొప్పున సంస్థలు చోటు దక్కించుకున్నాయి.

ఉద్యోగాల పరంగా కూడా ఈ కంపెనీలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. మొత్తం 3.4 లక్షల మంది వీటిలో పనిచేస్తుండగా,




మహిళా ఉద్యోగుల్లో డాక్టర్ రెడ్డీస్ అగ్రస్థానంలో ఉంది. దేశవ్యాప్తంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ మరోసారి అత్యంత విలువైన కంపెనీగా నిలిచింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

## భీమ్ పేమెంట్స్ లావాదేవీలు మూడింతలు

**హైదరాబాద్, జూన్ 25:** ప్రభుత్వ రంగ డిజిటల్ చెల్లింపుల యాప్ భీమ్ పేమెంట్స్ లావాదేవీలు గణనీయంగా పెరిగాయి. జూన్ 2025 నుంచి మే 2026 మధ్య ఈ యాప్ ద్వారా జరిగిన ఆర్థిక లావాదేవీలు మూడింతలు పెరిగినట్లు ఎన్‌పీసీఐ భీమ్ సర్వీసెస్ లిమిటెడ్ వెల్లడించింది. గత ఏడాది జూన్‌లో 79.64 మిలియన్ల లావాదేవీలు నమోదవగా, ఈ ఏడాది మే చివరి నాటికి అవి 244 మిలియన్లకు చేరుకున్నట్లు సంస్థ తెలిపింది. మొత్తం లావాదేవీల విలువ రూ.26,952 కోట్లుగా నమోదైనట్లు ఎన్‌బీఎస్ఎల్ ఎండీ, సీఈఓ లలితా నటరాజ్ పేర్కొన్నారు. డిజిటల్ చెల్లింపుల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో భీమ్ యాప్ వినియోగదారుల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోందని సంస్థ వెల్లడించింది. త్వరలోనే క్రెడిట్ కార్డు, డిజిటల్ రుణాలు, ఇతర ఆర్థిక సేవలను కూడా ప్రారంభించనున్నట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా జరిగిన లావాదేవీలలో తెలంగాణ వాటా 23.9 శాతంగా ఉన్నట్లు సమాచారం. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్నదానికి ఇది మరో సంకేతంగా నిపుణులు భావిస్తున్నారు.




## ఎఫ్‌డీ వడ్డీ రేట్లు పెంచిన బంధన్ బ్యాంక్

**కోల్‌కతా, జూన్ 25 :** బంధన్ బ్యాంక్ తన ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) వడ్డీ రేట్లను పెంచుతూ డిపాజిట్‌దారులకు శుభవార్త అందించింది. ఎంపిక చేసిన కాలపరిమితి డిపాజిట్లపై వడ్డీ రేట్లను గరిష్టంగా 20 బేసిస్ పాయింట్ల వరకు పెంచుతున్నట్లు బ్యాంక్ ప్రకటించింది. తాజా సవరణల ప్రకారం, రెండు నుంచి మూడు సంవత్సరాల కాలపరిమితి ఉన్న డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు గరిష్టంగా 7.95 శాతం వార్షిక వడ్డీ లభించనుంది. అదే కాలపరిమితిలో ఇతర ఖాతాదారులకు 7.45 శాతం వడ్డీని బ్యాంక్ అందించనుంది. అలాగే ఐదేళ్లలోపు కాలపరిమితి ఉన్న డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు 7.75 శాతం, సాధారణ ఖాతాదారులకు 7.25 శాతం వడ్డీని చెల్లించనున్నట్లు బ్యాంక్ తెలిపింది. ఈ నిర్ణయం ద్వారా స్థిర ఆదాయం కోరుకునే పెట్టుబడిదారులకు, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లకు మరింత ప్రయోజనం కలగనుందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## కేవలం 6 నిమిషాల్లోనే

### అమ్ముడైన స్కోడా కోడియాక్ ఆర్ఎస్

**ముంబై, జూన్ 25 :** భారత ఆటోమొబైల్ మార్కెట్‌లో లగ్జరీ కార్లకు ఉన్న క్రేజ్ మరోసారి స్పష్టమైంది. ప్రముఖ చెక్ ఆటోమొబైల్ సంస్థ స్కోడా తన కొత్త ప్రీమియం 7-సీటర్ పెర్ఫార్మెన్స్ ఎస్‌యూవీ కోడియాక్ ఆర్ఎస్ కోసం విడుదల చేసిన 50 యూనిట్లు కేవలం ఆరు నిమిషాల్లోనే పూర్తిగా అమ్ముడై కొత్త రికార్డు సృష్టించాయి. ఈ కారుకు సంబంధించిన ధరను ఇంకా అధికారికంగా ప్రకటించకముందే వినియోగదారులు ముందుగా రూ.3 లక్షల టోకెన్ అమౌంట్ చెల్లించి బుకింగ్‌లు చేసుకోవడం మార్కెట్ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది. గతంలో స్కోడా ఆక్టేవియా ఆర్ఎస్ మోడల్‌కు వచ్చిన డిమాండ్‌ను కూడా ఈ కొత్త మోడల్ అధిగమించినట్లు తెలుస్తోంది. సాధారణంగా కుటుంబ అవసరాల కోసం ఉపయోగించే 7-సీటర్ ఎస్‌యూవీ అయినప్పటికీ, ఇందులో స్పోర్ట్స్ కార్ స్థాయి పనితీరు ఉండటమే దీనికి భారీ డిమాండ్ రావడానికి కారణమని నిపుణులు చెబుతున్నారు. ఈ వాహనం పూర్తిగా విదేశాల్లో తయారై భారత మార్కెట్లోకి దిగుమతి చేయబడిన ప్రీమియం మోడల్. ఈ కారులో 1,984 సీసీ టర్బోచార్జ్డ్ పెట్రోల్ ఇంజన్‌ను అమర్చారు. ఇది 265 భీహెచ్‌పీ శక్తి, 400 ఎన్ఎమ్ టార్క్ ఉత్పత్తి చేస్తుంది. కేవలం 6.3 సెకన్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోవడం దీని ప్రత్యేకత. గరిష్టంగా గంటకు 231 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగల సామర్థ్యం కలిగి ఉంది.మొదటి విడత స్టాక్ తక్కువ సమయంలోనే అమ్ముడవడంతో, రెండో విడత వాహనాలపై కూడా భారీ డిమాండ్ ఉండే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.




## సుప్రా పసిఫిక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ భారీ విస్తరణ ప్రణాళిక

**ముంబై, జూన్ 25 :** ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ సుప్రా పసిఫిక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ దేశవ్యాప్తంగా తమ కార్యకలాపాలను విస్తరించేందుకు భారీ ప్రణాళికలను ప్రకటించింది. రాబోయే మూడేళ్ల కాలంలో 15 రాష్ట్రాల్లో 500 కొత్త శాఖలను ఏర్పాటు చేయడంతో పాటు, రూ.2,500 కోట్ల విలువైన నిర్వహణ ఆస్తులను సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఈ విస్తరణలో భాగంగా ముంబైలోని అంధేరిలో సంస్థ కొత్త కార్పొరేట్ కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఛైర్మన్ మహేష్ థక్కర్, కంపెనీ ముఖ్య కార్యనిర్వాహక అధికారి మనోజ్ రవి పాల్గొన్నారు. ప్రస్తుతం ఈ సంస్థ గుజరాత్, ఢిల్లీ, రాజస్థాన్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లో సేవలు అందిస్తోంది. ఇకపై కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గోవా వంటి రాష్ట్రాల్లో కూడా తమ సేవలను వేగంగా విస్తరించనున్నట్లు సంస్థ వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆస్తులు రూ.290 కోట్ల నుంచి రూ.499 కోట్లకు పెరిగి 64.39 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ఆర్థిక సమ్మిళితత్వాన్ని పెంచే లక్ష్యంతో గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాల్లో బంగారు రుణాలు, చిన్న వ్యాపార రుణాలను అందించడమే ప్రధాన లక్ష్యమని సంస్థ సీఈఓ తెలిపారు. ఈ విస్తరణ ప్రణాళికలో భాగంగా రాబోయే మూడేళ్లలో ఉద్యోగుల సంఖ్యను 700 నుంచి 2,000కు పైగా పెంచనున్నట్లు కంపెనీ ప్రకటించింది. అలాగే 2026-27 ఆర్థిక సంవత్సరంలో నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్ల పబ్లిక్ ఇష్యూ ద్వారా నిధుల సమీకరణకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

## సైబర్ మోసాలకు బ్రేక్

### 5 రోజుల్లో తప్పనిసరి రీఫండ్‌కి ఆర్‌బీఐ ఆదేశాలు

**ముంబై, జూన్ 25 :** డిజిటల్ చెల్లింపులు, క్రెడిట్ కార్డు వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ మోసాలను అరికట్టేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త మార్గదర్శకాల ప్రకారం, డిజిటల్ మోసం లేదా అనధికారిక లావాదేవీలకు గురైన ఖాతాదారులకు బ్యాంకులు గరిష్టంగా ఐదు పనిదినాల్లోపే రీఫండ్ చేయాల్సి ఉంటుంది. ఈ రీఫండ్‌ను "షాడో రివర్సల్" లేదా "తాత్కాలిక క్రెడిట్" రూపంలో బాధితుడి ఖాతా లేదా క్రెడిట్ కార్డులో వెంటనే జమ చేయాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. బ్యాంకు విచారణ పూర్తయ్యే వరకు ఖాతాదారులు తమ సొమ్ము కోసం వేచి ఉండాల్సిన అవసరం లేకుండా ఈ విధానం తీసుకొచ్చినట్లు పేర్కొంది. ఇదే కాకుండా, ట్రాన్సాక్షన్ అలర్ట్స్ వ్యవస్థలో కూడా ఆర్‌బీఐ కీలక మార్పులు చేసింది. ఇకపై క్రెడిట్ కార్డు లేదా డిజిటల్ చెల్లింపుల ద్వారా రూ.500 లేదా అంతకంటే ఎక్కువ విలువైన ప్రతి లావాదేవీకి వెంటనే మొబైల్ ఫోన్ మరియు ఈమెయిల్‌కు అలర్ట్ మెసేజ్ రావడం తప్పనిసరి కానుంది. ఈ నూతన నిబంధనలు 2027 జనవరి 1 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. ఈ మార్పులతో అనధికారిక లావాదేవీలను త్వరగా గుర్తించడం, కార్డులను వెంటనే బ్లాక్ చేయడం సాధ్యమవుతుందని అధికారులు భావిస్తున్నారు. ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ నిర్ణయం బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని పెంచడమే కాకుండా సైబర్ నేరగాళ్లకు గట్టి అడ్డుకట్ట వేస్తుందని భావిస్తున్నారు.



# భారత్-ఐర్లాండ్ టీ20 మ్యాచ్ సమయాల్లో మార్పు




**బెల్‌ఫాస్ట్, జూన్ 25 :** భారత్–ఐర్లాండ్ మధ్య జరగనున్న రెండు టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల ప్రారంభ సమయాల్లో మార్పు చేసినట్లు క్రికెట్ ఐర్లాండ్ ప్రకటించింది. తొలుత సాయంత్రం 7 గంటలకు ప్రారంభం కావాల్సిన మ్యాచ్‌లు ఇప్పుడు సాయంత్రం 6 గంటలకే ప్రారంభం కానున్నాయి. జూన్ 28న జరగనున్న రెండో టీ20 మ్యాచ్ సమయం, అదే రోజు మహిళల ప్రపంచకప్‌లో భారత్––ఆస్ట్రేలియా మ్యాచ్‌తో కలిసిపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రసార భాగస్వాములతో చర్చల అనంతరం మ్యాచ్ సమయాన్ని ముందుకు మార్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ రెండు మ్యాచ్‌లు బెల్‌ఫాస్ట్‌లోని సివిల్ సర్వీస్ క్రికెట్ క్లబ్ వేదికగా జూన్ 26, 28 తేదీల్లో జరగనున్నాయి. ఈ సిరీస్ ద్వారా శ్రేయస్ అయ్యర్ భారత టీ20 జట్టుకు కొత్త కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించనుండగా, ఐర్లాండ్ జట్టుకు లోర్కన్ టక్కర్ నాయకత్వం వహించనున్నారు. మ్యాచ్ సమయ మార్పుతో అభిమానులకు రెండు కీలక క్రికెట్ మ్యాచ్‌లను సజావుగా వీక్షించే అవకాశం లభించనుంది.

# కోహ్లి వన్8 షూస్‌కు భారీ స్పందన

**24 గంటల్లోనే లక్షన్నర జతలు అమ్మకం**



**ముంబై, జూన్ 25 :** టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి మరోసారి తన బ్రాండ్ విలువతో వార్తల్లో నిలిచాడు. ఆయన ప్రారంభించిన 'వన్8' గ్లోబల్ షూ బ్రాండ్ లాంచ్ అయిన కేవలం 24 గంటల్లోనే లక్షన్నర జతలు అమ్ముడై సరికొత్త రికార్డు సృష్టించాయి. ఈ అమ్మకాలతో ఒక్కరోజులోనే రూ.138 కోట్లకు పైగా ఆదాయం వచ్చినట్లు మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. క్రీడా రంగంలో మాత్రమే కాకుండా వ్యాపార ప్రపంచంలోనూ కోహ్లికి ఉన్న క్రేజ్ ఈ ఫలితాలతో స్పష్టమవుతోందని నిపుణులు చెబుతున్నారు. ఈ షూస్ ధరను కోహ్లి టెస్ట్ క్రికెట్‌లో సాధించిన 9,230 పరుగులకు గుర్తుగా రూ.9,230గా నిర్ణయించడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. ప్రీ–బుకింగ్ ఆధారంగా మాత్రమే అమ్మకాలు జరగడంతో అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. లాంచ్ ఈవెంట్‌లో పాల్గొనడానికి కూడా ప్రత్యేకంగా ప్రీ–బుక్ చేసిన కొనుగోలుదారులకే అవకాశం కల్పించారు. అయినప్పటికీ అభిమానుల నుంచి ఊహించని స్థాయిలో స్పందన లభించడం గమనార్హం. ఈ విజయంతో కోహ్లి కేవలం క్రికెటర్‌గా మాత్రమే కాకుండా, గ్లోబల్ స్పోర్ట్స్ బ్రాండ్ ఐకాన్‌గా తన స్థానాన్ని మరింత బలపర్చుకున్నారని మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు.



# భారత క్రికెట్ చరిత్రను మార్చిన రోజు

**లండన్, జూన్ 25 :** భారత క్రికెట్ దిశను పూర్తిగా మార్చేసిన చారిత్రాత్మక రోజు జూన్ 25. 1983లో ఇదే రోజున కపిల్ దేవ్ నేతృత్వంలోని టీమిండియా ప్రపంచ క్రికెట్‌ను ఏలుతున్న వెస్టిండీస్‌ను ఓడించి తొలి వన్డే ప్రపంచకప్‌ను గెలుచుకుంది. లార్డ్స్ మైదానంలో జరిగిన ఆ ఫైనల్ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్, వెస్టిండీస్ పేస్ దాడిని ఎదుర్కోలేక 60 ఓవర్లలో 183 పరుగులకే ఆలౌట్ అయింది. తక్కువ స్కోరు అయినప్పటికీ భారత బౌలర్లు అద్భుత ప్రదర్శన చేసి విండీస్ జట్టును 140 పరుగులకే కుప్పకూల్చారు. దీంతో భారత్ 43 పరుగుల తేడాతో చారిత్రాత్మక విజయాన్ని అందుకుంది. ఈ మ్యాచ్‌లో కీలక మలుపుగా నిలిచింది వివ్ రిచర్డ్స్ ఇచ్చిన క్యాచ్. కెప్టెన్ కపిల్ దేవ్ వెనక్కి పరుగెత్తుతూ తీసిన ఆ అద్భుత క్యాచ్ మ్యాచ్ గమనాన్నే మార్చేసింది. ఆ వికెట్ తర్వాత వెస్టిండీస్ పతనం ప్రారంభమై చివరకు ఓటమికి దారితీసింది. ఈ విజయంతో భారత్‌లో క్రికెట్ కేవలం ఆటగా కాకుండా ఒక భావోద్వేగంగా మారిందని విశ్లేషకులు చెబుతున్నారు. తరువాతి తరంలో సచిన్ టెండూల్కర్ వంటి దిగ్గజాల ఎదుగుదలకు ఈ విజయం స్ఫూర్తిగా నిలిచింది. అంతేకాకుండా భారత క్రికెట్ బోర్డు ప్రపంచ స్థాయిలో శక్తివంతమైన సంస్థగా ఎదగడానికి ఈ రోజు పునాది వేసినట్టుగా భావిస్తారు.

## ఇంగ్లండ్ వన్డే సిరీస్ జట్టుపై

# మంజ్రేకర్ విమర్శలు

**జైస్వాల్ పక్కన పెట్టడంపై చర్చ**




**ముంబై, జూన్ 25 :** ఇంగ్లండ్‌తో జరగనున్న వన్డే సిరీస్ కోసం భారత జట్టును ప్రకటించిన నేపథ్యంలో సెలక్షన్ నిర్ణయాలపై మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత సంజయ్ మంజ్రేకర్ తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యంగా ఫామ్‌లో ఉన్న యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ను జట్టులోకి తీసుకోకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. మంజ్రేకర్ మాట్లాడుతూ, జైస్వాల్ తన చివరి మూడు వన్డేల్లో అద్భుత ప్రదర్శన చేసినప్పటికీ అతనికి అవకాశం ఇవ్వకపోవడం కఠినమైన నిర్ణయమని అభిప్రాయపడ్డారు. "అలాంటి ఫామ్‌లో ఉన్న ఆటగాడిని పక్కనపెట్టడం అన్యాయం" అని ఆయన వ్యాఖ్యానించారు. అదే సమయంలో కెప్టెన్ రోహిత్ శర్మ ఎంపికపై కూడా ఆయన పరోక్ష వ్యాఖ్యలు చేశారు. స్టార్ ఆటగాళ్ల ప్రాధాన్యత ఆధారంగా కాకుండా, పూర్తిగా ప్రదర్శన ఆధారంగానే జట్టు ఎంపిక జరగాలని అన్నారు. భారత క్రికెట్‌లో పెద్ద పేర్ల ప్రభావం ఎక్కువగా ఉండటంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. "సెలక్షన్ అనేది వ్యక్తుల కోసం కాకుండా భారత క్రికెట్ భవిష్యత్తు కోసం ఉండాలి" అని మంజ్రేకర్ స్పష్టం చేశారు. రాబోయే ప్రపంచకప్ ప్రణాళికల్లో రోహిత్ పాత్రపై కూడా స్పష్టత అవసరమని సూచించారు. ఇదే సమయంలో యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ భవిష్యత్తులో మరింత మెరుగైన ప్రదర్శన ఇవ్వాలని ఆయన ఆకాంక్షించారు.



# మూడేళ్ల తర్వాత బ్రెజిల్ జెర్సీలో నెయ్‌మార్ పునరాగమనం..

**మియామి, జూన్ 25 :** ఫుట్‌బాల్ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూసిన క్షణం చివరకు సాకారమైంది. బ్రెజిల్ స్టార్ ఆటగాడు నెయ్‌మార్ దాదాపు మూడేళ్ల (981 రోజులు) విరామం తర్వాత జాతీయ జట్టు జెర్సీని తిరిగి ధరించాడు. ఫిఫా ప్రపంచకప్ 2026 గ్రూప్–సి మ్యాచ్‌లో స్కాట్లాండ్‌తో జరిగిన పోరులో నెయ్‌మార్ 76వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్‌గా మైదానంలోకి అడుగుపెట్టాడు. అతను వార్మప్ చేస్తున్న క్షణాల నుంచే స్టేడియంలో అభిమానులు కరతాళ ధ్వనులతో ఉత్సాహం వ్యక్తం చేశారు. 2023 అక్టోబర్‌లో ఉరుగ్వేతో జరిగిన మ్యాచ్‌లో తీవ్రమైన మోకాలి గాయంతో అతను ఆటకు దూరమయ్యాడు. శస్త్రచికిత్స తర్వాత దీర్ఘకాలం విశ్రాంతి తీసుకున్న నెయ్‌మార్, 34 ఏళ్ల వయసులో తిరిగి ఫిట్‌నెస్ సాధించి జట్టులోకి రావడం ప్రత్యేకంగా నిలిచింది. మ్యాచ్ అనంతరం భావోద్వేగానికి లోనైన నెయ్‌మార్ మాట్లాడుతూ, "మూడేళ్ల తర్వాత మళ్లీ జాతీయ జెర్సీ ధరించడం మాటల్లో చెప్పలేని ఆనందం" అని తెలిపాడు. ఆటకు దూరంగా ఉన్న కాలం తనకు మానసికంగా ఎంతో కష్టంగా గడిచిందని ఆయన చెప్పాడు. ఈ మ్యాచ్‌లో బ్రెజిల్ 3–0 తేడాతో ఘన విజయం సాధించగా, వినిసియస్ జూనియర్ రెండు గోల్స్‌తో మెరిశాడు. నెయ్‌మార్ రాక జట్టుకు మరింత ఆత్మవిశ్వాసం ఇచ్చిందని సహచర ఆటగాళ్లు అభిప్రాయపడ్డారు.




## అభిషేక్ పోరెల్‌పై పెళ్లి పేరుతో

# మోసం ఆరోపణలు..

కోల్‌కతా, జూన్ 25 : ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్ అభిషేక్ పోరెల్ చుట్టూ వివాదం చోటుచేసుకుంది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడంటూ ఓ యువతి చేసిన ఆరోపణలు ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా మొగ్రా పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు తన తల్లితో కలిసి వెళ్లి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. తనతో గత మూడేళ్లుగా సంబంధంలో ఉన్న అభిషేక్ పోరెల్, పెళ్లి చేస్తానని నమ్మించి తర్వాత దూరమయ్యాడని ఆమె ఆరోపించింది. అంతేకాక తనపై దాడి చేశాడని కూడా ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇక ఈ ఆరోపణలను అభిషేక్ పోరెల్ తీవ్రంగా ఖండించాడు. తన క్రికెట్ కెరీర్‌లో మంచి ఫామ్‌లో ఉన్న సమయంలో కావాలనే తన పేరును వివాదాల్లోకి లాగుతున్నారని ఆయన స్పందించినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ వ్యవహారం చట్టపరమైన విచారణ దశలో ఉంది.



# న్యూజిలాండ్‌కు ఎదురుదెబ్బ

నాటింగ్‌హమ్, జూన్ 25: ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో నిర్ణయాత్మక మూడో మ్యాచ్‌కు ముందు న్యూజిలాండ్ జట్టుకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. కీలక ఆటగాళ్లు మ్యాట్ హెన్రీ, గ్లెన్ ఫిలిప్స్ గాయాల కారణంగా చివరి టెస్టుకు దూరమయ్యారు. కెన్నింగ్‌టన్ ఓవల్‌లో జరిగిన రెండో టెస్టులో న్యూజిలాండ్ విజయంలో వీరిద్దరూ కీలక పాత్ర పోషించారు. గ్లెన్ ఫిలిప్స్ తొలి ఇన్నింగ్స్‌లో శతకం సాధించగా, మ్యాట్ హెన్రీ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 11 వికెట్లు తీసి ఇంగ్లండ్ బ్యాటింగ్‌ను కుదేలు చేశాడు. న్యూజిలాండ్ క్రికెట్ తెలిపిన వివరాల ప్రకారం, హెన్రీ ఎడమ కాలి పిక్క కండరంలో స్వల్ప చీలికకు గురయ్యాడు. అతడు కోలుకోవడానికి రెండు నుంచి నాలుగు వారాల సమయం పట్టే అవకాశం ఉంది. మరోవైపు పక్కటెముకల నొప్పితో బాధపడుతున్న గ్లెన్ ఫిలిప్స్ కూడా మూడో టెస్టుకు అందుబాటులో ఉండడని జట్టు యాజమాన్యం వెల్లడించింది. ఇప్పటికే సిరీస్‌ను సమం చేసిన న్యూజిలాండ్, మూడో టెస్టులో గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకోవాలని భావిస్తున్న సమయంలో ఈ ఇద్దరు ఆటగాళ్లు దూరం కావడం జట్టుకు పెద్ద లోటుగా మారింది. వీరి స్థానాల్లో బెన్ సియర్స్, మిచెల్ శాంట్నర్‌లను జట్టులోకి ఎంపిక చేశారు.

చురకలు





# ‘ఎన్బీకే112’ షురూ

**అమరావతి, జూన్ 25:** నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా, దర్శకుడు కొరటాల శివ తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం ‘ఎన్బీకే112’ పూజా కార్యక్రమాలతో అమరావతిలో ఘనంగా ప్రారంభమైంది. నవ్యాంధ్ర రాజధానిలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరై తొలి సన్నివేశానికి క్లాప్ కొట్టారు. బాలకృష్ణ చిన్న కుమార్తె తేజస్విని కెమెరా స్విచ్ ఆన్ చేయగా, అనంతరం బాలకృష్ణ తన సినిమా డైలాగ్‌తో అభిమానులను అలరించారు. కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, నిర్మాత సురేశ్ బాబు సహా సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ అమరావతి ప్రస్తుతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని అన్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో చలనచిత్ర పరిశ్రమను విస్తరించాలనే ఉద్దేశంతో ఈ సినిమా ప్రారంభోత్సవాన్ని అమరావతిలో నిర్వహించినట్లు తెలిపారు. ఎన్టీఆర్, ఏఎన్నార్ పుట్టిన ఈ నేలపై సినీ రంగాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో అనేక అందమైన చిత్రీకరణ ప్రదేశాలు ఉన్నాయని, అందరి సహకారంతో పరిశ్రమను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ తాను ఇప్పటి వరకు సినిమా షూటింగ్‌లు, ప్రదర్శనలకు మాత్రమే వెళ్లానని, తొలిసారిగా ఓ సినిమా ప్రారంభోత్సవానికి హాజరై క్లాప్ కొట్టానని అన్నారు. తన ముద్దుల మామయ్య బాలకృష్ణ చిత్రానికి క్లాప్ కొట్టడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. బాలకృష్ణ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తామని చెప్పారు. అమరావతి పవిత్ర భూమి అని, భవిష్యత్తులో మరిన్ని సినిమాలు ఇక్కడే ప్రారంభం కావాలని ఆకాంక్షించారు. సమాచారం ప్రకారం ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఆగస్టులో ప్రారంభం కానుండగా, 2027 వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర బృందం ప్రణాళిక రూపొందిస్తోంది. బాలకృష్ణ–కొరటాల శివ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే సినీ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.



# ‘ఇడుపు కాయితం’ ప్రారంభం




విభిన్న కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న నటుడు ప్రియదర్శి ప్రధాన పాత్రలో, జానపద గాయని నాగదుర్గ హీరోయిన్‌గా నటిస్తున్న ‘ఇడుపు కాయితం’ చిత్రం పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. తెలంగాణ వాడుక భాషలో ‘ఇడుపు కాయితం’ అంటే ‘విడాకుల పత్రం’ అనే అర్థం. వంశీరెడ్డి దొండపాటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సుకుమార్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ప్రముఖ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ విడుదల చేశారు. సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో నిర్మాత బన్నీవాసు మాట్లాడుతూ మంచి కథకు ప్రాంతీయ హద్దులు ఉండవని మరోసారి ఈ చిత్రం నిరూపిస్తుందని అన్నారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకునే కథ అని, తెలుగు సినిమా అయినప్పటికీ ఇతర రాష్ట్రాల ప్రేక్షకులను సైతం మెప్పించే అంశాలు ఇందులో ఉన్నాయని తెలిపారు. ప్రతి కుటుంబంలో కనిపించే ఓ సాధారణ సమస్యను ప్రధానాంశంగా తీసుకుని ఈ కథను రూపొందించామని బన్నీవాసు చెప్పారు. పెళ్లైన ప్రతి ఒక్కరూ ఈ చిత్రంలోని భావోద్వేగాలకు అనుసంధానం అవుతారని అన్నారు. కుటుంబ సంబంధాలు, అత్తా కోడళ్ల మధ్య బంధాలను హృద్యంగా చూపించే కథగా ఈ చిత్రం నిలుస్తుందని పేర్కొన్నారు. హీరోయిన్ పాత్ర కోసం నాగదుర్గను సంప్రదించినప్పుడు ఆమె తనకు 15 షరతులు పెట్టిందని బన్నీవాసు వెల్లడించారు. ఆ షరతులు విన్న తర్వాత ఒక తెలుగు అమ్మాయి తన కెరీర్, పాత్రల ఎంపిక విషయంలో ఎంత స్పష్టతతో ఉంటుందో అర్థమైందని చెప్పారు. ఇప్పటికే జానపద గీతాలతో మంచి గుర్తింపు సంపాదించుకున్న నాగదుర్గ ఈ చిత్రంతో వెండితెరకు పరిచయం కానుంది. సుకుమార్ రైటింగ్స్ బ్యానర్ నుంచి వచ్చిన చిత్రాలు ప్రత్యేక గుర్తింపు పొందాయని, ‘ఇడుపు కాయితం’ కూడా అదే స్థాయిలో ప్రేక్షకుల ఆదరణ పొందే చిత్రంగా నిలుస్తుందని నిర్మాత తబిత సుకుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. కుటుంబ బంధాలు, భావోద్వేగాలతో కూడిన ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందని చిత్ర బృందం తెలిపింది.

# వెండితెరపైకి వస్తోన్న మిర్జాపూర్




అత్యంత ప్రజాదరణ పొందిన క్రైమ్ డ్రామా వెబ్ సిరీస్ ’మిర్జాపూర్’ ఇప్పుడు వెండితెరపై అలరించడానికి సిద్ధమైంది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో మూడు సీజన్ల పాటు ఓటీటీ ప్రేక్షకులను అలరించిన ఈ సిరీస్, ఇప్పుడు ’మిర్జాపూర్: ది మూవీ’ పేరుతో భారీ ఫీచర్ ఫిల్మ్‌గా రాబోతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సినిమాకు సంబంధించిన అధికారిక టీజర్‌ను విడుదల చేశారు. ఈ టీజర్‌లో పంకజ్ త్రిపాఠి కాలీన్ భయ్యాగా, అలీ ఫజల్ గుడ్డూ భయ్యాగా, దివ్యేందు మున్నా భయ్యాగా తమ ఐకానిక్ పాత్రల్లో మళ్లీ కనిపించి అభిమానులను అలరించారు. మరోవైపు ఈ చిత్రంలో రవి కిషన్, పంచాయత్ ఫేమ్ జితేంద్ర కుమార్ కీలక పాత్రల్లో ఎంట్రీ ఇస్తూ మరింత ఆసక్తిని పెంచుతున్నారు. రెండు నిమిషాల కంటే ఎక్కువ నిడివి ఉన్న ఈ టీజర్ పాత జ్ఞాపకాలను గుర్తు చేస్తూ, మరింత భారీ యాక్షన్ మరియు పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో సాగింది. ఈ సారి కేవలం మిర్జాపూర్ గద్దె కోసమే కాకుండా అధికారం కోసం కూడా యుద్ధం జరగబోతోందని టీజర్‌తో స్పష్టమవుతుంది. ఈ చిత్రం సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. కేవలం హిందీలోనే కాకుండా ఇతర భాషలో కూడా థియేటర్లలో విడుదలరాబోతున్నట్లు తెలుస్తుంది.

# లోకేష్ సినిమాలో కొత్త లుక్‌లో బన్నీ




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అధికారిక ప్రకటన వెలువడినప్పటి నుంచే ఈ ప్రాజెక్ట్ సినీ వర్గాలు, అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఈ సినిమాకు సంబంధించి మరో ఆసక్తికర వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ప్రస్తుతం అల్లు అర్జున్ దర్శకుడు అట్లీతో కలిసి ‘రాకా’ చిత్రంలో నటిస్తున్నాడు. భారీ వ్యయంతో, అత్యాధునిక సాంకేతికతతో రూపొందుతున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. అయితే ఆ చిత్రంలో కనిపించే లుక్‌కు పూర్తిగా భిన్నంగా లోకేష్ కనగరాజ్ సినిమాలో కనిపించేందుకు అల్లు అర్జున్ సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. లోకేష్ కనగరాజ్ తన చిత్రాల్లో హీరోలను కొత్త కోణంలో చూపించడంలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ఈ నేపథ్యంలో అల్లు అర్జున్‌ను కూడా ఇప్పటివరకు ఎప్పుడూ కనిపించని విధంగా తెరపై ఆవిష్కరించేందుకు ఆయన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

## ‘రాకా’ తర్వాత పూర్తి దృష్టి

‘రాకా’ చిత్రం పనులు పూర్తైన వెంటనే లోకేష్ కనగరాజ్ సినిమా కోసం అల్లు అర్జున్ తన రూపురేఖల్లో మార్పులు చేసుకోనున్నట్లు సమాచారం. పాత్రకు అనుగుణంగా ప్రత్యేక మేకోవర్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నాడనే వార్త అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచుతోంది. అల్లు అర్జున్–లోకేష్ కనగరాజ్ కలయికలో సినిమా వస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. యాక్షన్, భావోద్వేగాలు, లోకేష్ ప్రత్యేక శైలితో రూపొందనున్న ఈ చిత్రం భవిష్యత్తులో అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌లలో ఒకటిగా నిలుస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# అందాల నిధిని వరించని అదృష్టం

అందాల భామ నిధి అగర్వాల్ చివరి చిత్రం రాజాసాబ్. ఈ సినిమా వచ్చి దాదాపు ఆరు నెలలు గడిచినా ఇప్పటి దాకా మరో కొత్త ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించలేదు. హరిహర వీరమల్లు, రాజా సాబ్ తర్వాత పెద్ద పెద్ద ఆఫర్లు వస్తాయని ఆశించిన నిధికి అదృష్టం కలిసి రావడం లేదు. ఆ రెండు చిత్రాలు డిజాస్టర్ కావడంతో అవకాశాలు ఏమో కానీ అమెను పలకరించిన దర్శకనిర్మాతలే లేరు. ఇక లాభం లేదనుకున్న నిధి ప్రస్తుతంబ్రాండ్ ఎండార్స్‌మెంట్స్, కమర్షియల్ ప్రదర్శనలపై దృష్టి పెట్టారు. ఇవే ఆమెకు స్థిరమైన ఆదాయ వనరుగా ఉన్నాయని సమాచారం. నెలకు రూ 5 లక్షలు ఖర్చు నటి జీవితంలో నెలకు వచ్చే ఖర్చుల గురించి ఒక ఇంటర్వ్యూలో నిధి అగర్వాల్ వివరించారు. కనీసం నెలకు రూ 5 లక్షలు ఖర్చవుతాయని తెలిపారు. ఈ ఖర్చులో ప్రయాణం, వసతి, ఫిట్‌నెస్, ఆహారం, మొత్తం జీవనశైలిని నిర్వహించడానికి అయ్యే వ్యయాలు ఉంటాయని చెప్పారు. ఇవి కాకుండా, వ్యక్తిగత సిబ్బందిపై అయ్యే ఖర్చులు అదనంగా ఉంటాయని ఆమె స్పష్టం చేశారు. ఒక సెలబ్రిటీగా కనిపించడానికి అవసరమైన ప్రతిదానిపై నిరంతరం ఖర్చు చేయాల్సి వస్తుందని తెలిపారు. బయటకు కనిపించే గ్లామర్ వెనుక ఉన్న వాస్తవాలు ఇవేనని ఆమె అభిప్రాయాన్ని వెల్లడించారు. ఖర్చులు మాత్రం సమానంగా సినీ రంగంలో హీరోలకు ఎక్కువ పారితోషికం లభిస్తుందని, కానీ హీరోయిన్లకు తక్కువే వస్తుందని కూడా ఆమె వెల్లడించారు. అయినప్పటికీ, ఖర్చులు మాత్రం సమానంగానే ఉంటాయని ఆమె పేర్కొన్నారు. నటీమణులు తమ రూపం, ఫిట్‌నెస్, ఇమేజ్‌ను నిలబెట్టుకోవడానికి నిరంతరం పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని చెప్పారు.మొత్తంగా, నిధి అగర్వాల్ చేసిన ఈ వ్యాఖ్యలు సినీ రంగంలో నటీమణులు ఎదుర్కొనే ఆర్థిక ఒత్తిడిని ప్రతిబింబిస్తున్నాయి. స్థిరమైన ఆదాయం లేకపోయినా, ఖర్చులు మాత్రం నిరంతరం ఉండటం ఒక పెద్ద సవాల్‌గా మారుతుందని ఆమె మాటలు సూచిస్తున్నాయి.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com